టీడీపీకి ఓటేస్తే.. ఊరుకోం..



చికిత్స పొందుతున్న లచ్చయ్య

- హోం ఓటింగ్‌లో దౌర్జన్యాలు, దాడులు
- పల్నాడులో చెలరేగిపోతోన్న వైసీపీ మూకలు
- పోలింగ్ సమీపిస్తోన్న తరుణంలో పెట్రేగిపోతున్నారు..
- శిరిగిరిపాడు, మాదలలో అధికారుల సమక్షంలోనే దాడులు
- కమ్మవారైనా వైసీపీకి ఓటేయాలి.. లేకుంటే తంతామన్న అంబటి అనుచరులు
- పోలీసు హెచ్చరికలను ఖాతరు చేయని ఫ్యాన్ పార్టీ శ్రేణులు



వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన కార్యకర్త

వెల్దుర్తి, ముప్పాళ్ల, మే 8: వైసీపీ మూకలు పోలీసుల హెచ్చరికలను ఖాతరు చేయడంలేదు. పోలింగ్ సమయం సమీపిస్తోన్న తరుణంలో చెలరేగిపోతున్నారు. రాష్ట్రంలోనే అన్ని జిల్లాల కన్నా పల్నాడు జిల్లాకి ఎక్కువ కేంద్ర సాయుధ బలగాలను కేటాయించారు. ప్రశాంత పోలింగ్‌కు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఒకవైపు పోలీసు అధికారులు చెప్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన బందోబస్తు ఉంది. ఏ చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా క్విక్ రెస్పాన్స్ టీం, రాపిడ్ రెస్పాన్స్ టీం సత్వరం ఆ ప్రాంతానికి తరలిస్తున్నాం.. అని పోలీసులు అధికారులు చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు భయపడటంలేదు. నాలుగు రోజులుగా పల్నాడులో జరుగుతున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం. పోస్టల్ బ్యాలెట్‌లో ఓటింగ్ సమయంలో జిల్లా కేంద్రమైన నరసరావు పేటలో వైసీపీ శ్రేణులు టీడీపీ నాయకులపై పోలీసుల సమ క్షంలోనే రెచ్చిపోయిన విషయం తెలిసిందే. బుధవారం హోం ఓటింగ్‌లో కూడా ఓట్లు టీడీపీ అనుకూలంగా పడుతున్నట్లు పసిగట్టిన వైసీపీ నాయకులు రెచ్చిపోయారు. పింఛన్లు అందుకుంటున్న వారు కూడా వైసీపీకి అనుకూలంగా ఓటు వేయడం లేదనే అనుమానంతో రెచ్చిపోయారు. టీడీపీకి ఓట్లేస్తే సహించేది లేదంటూ అధికారుల సమక్షంలోనే ఓటర్లకు హెచ్చరికలు జారీ చేసి దాడులకు దిగారంటే వారి బరితెగింపు అర్థమవుతోంది. పదుల సంఖ్యలో ఓట్ల విషయంలోనే గ్రామాల్లో అరాచకం సృష్టిస్తే 13న జరిగే పోలింగ్ రోజున పరిస్థితి ఏమిటోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఐ, సహా మరొకరికి తీవ్రగాయాలు

వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో అధికారులు బుధవారం హోం ఓటింగ్ నిర్వహించారు. గ్రామంలోని బొడ్రాయి సెంటర్లో ఓ దివ్యాంగుడితో ఓటు వేయించేందుకు అతడి ఇంటికి వెళ్లారు. హోం ఓటింగ్‌లో మెజార్టీ ఓట్లు టీడీపీకి పడుతున్నట్లు పసిగట్టిన వైసీపీ మూకలు అక్కడకు చేరారు. టీడీపీ వర్గీయులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. టీడీపీకి చెందిన అందుగుల లచ్చయ్యపై పదునైన ఆయుధంతో దాడికి దిగారు. ఈ దాడిలో లచ్చయ్య చేయి, తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో టీడీపీ వర్గీయులు ప్రతిఘటించారు. దీంతో ఇరువర్గాలు రాళ్లు విసురుకున్నారు. వైసీపీ వారు విసిరిన రాయి తగిలి ఎస్ఐ శ్రీహరి తలకు గాయమైంది. ఈ ఘటనలో ఓ కారు అద్దాలు కూడా పగిలిపోయాయి. తీవ్రంగా గాయపడిన లచ్చయ్యను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మాదలలో అంబటి అనుచరుల అరాచకం

ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంచాం.. ఓట్లు ఎవరైనా మాకు వేయాల్సిందే.. కమ్మవారైనా వైసీపీకి ఓటు వేయాల్సిందే.. లేకుంటే బయటకు లాగి తంతాం.. అంతు చూస్తాం.. అంటూ ముప్పాళ్ల మండలం మాదల ఎస్టీ కాలనీలో మంత్రి అంబటి అనుచరులు రెచ్చిపోయారు. హోం ఓటింగ్‌లో ఓటు వేయించేందుకు ఎస్టీ కాలనీలోని మాసాని కనకయ్య అనే అతడి ఇంటి వద్దకు అధికారులు బుధవారం వచ్చారు. టీడీపీ సానుభూతిపరుడైన అతడి ఓటు తమకే వేయాలంటే అక్కడికి వైసీపీ శ్రేణులు చేరుకున్నాయి. తమకు ఓటు వేయకపోతే మీ సంగతి తేలుస్తాం అంటూ కాలనీవాసులను బెదిరిస్తూ గొడవకు దిగారు. టీడీపీ నాయకుడు గోగినేని ఏసుబాబు, మరికొందరు వారిని అడ్డుకున్నారు. ఎవరి ఓట్లు వారు వేసుకుందాం, మీ ఓటర్ల వద్దకు వచ్చి మేము ఇలా చేస్తున్నామా.. ఇలా బెదిరించడం పద్ధతి కాదని వైసీపీ నాయకుడు యాలవర్తి పాటి సైదాకి ఏసుబాబు చెప్పారు. దీంతో మా అన్నకే వేలు చూపిస్తావా అని ఏసుబాబును సైదా తమ్ముడు ఖాశిం కొట్టాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆ తర్వాత టీడీపీ అభిమాని పరిమి నాగభూషణం నివాసం వద్దకు అధికారులు వెళ్లగా అక్కడ వైసీపీ వారిని టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. తాము నెలనెలా వారికి పింఛన్ ఇస్తున్నాం.. ఓట్లు అడిగి వేయించుకుంటాం.. మా ప్రభుత్వం మా ఇష్టం అని అంటూ గొడవకు దిగి టీడీపీ వారిపై రాళ్లు వేశారు. టీడీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేశారు. టీడీపీకి చెందిన రావిపాటి నాగేశ్వరరావు, కందుల నరశింహారావు, వైసీపీకి చెందిన పుల్లారెడ్డి గాయపడ్డారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గొడవను వీడియో తీస్తున్న విలేకర్లపైనా వైసీపీ వర్గీయులు దౌర్జన్యానికి దిగగా పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. వీడియోలు తీయవద్దని తీస్తే బాగోదని పోలీసుల ముందే బెదిరించారు. దాడి చేస్తున్న వైసీపీ వర్గీయులను అడ్డుకోవడంలో పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని, వైసీపీ వారు తమపైకి వస్తున్నా పోలీసులు తమనే నెట్టేస్తూ వెళ్ళిపోవాలన్నారని టీడీపీ కార్యకర్తలు వాపోయారు. గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ హజరతయ్య తెలిపారు.



దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

అండగా ఉంటాం : కన్నా లక్ష్మీనారాయణ

మాదలలో వైసీపి వర్గీయుల దాడిలో గాయపడిన సత్తెనపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రావిపాటి నాగేశ్వరరావు, కందుల నరశింహారావులను కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, ఆయన తనయుడు కన్నా నాగరాజు పరామర్శించారు. వైసీపీ వారి దౌర్జన్యాలకు, దాడులకు భయ పడవద్దని అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

సంక్షేమంపై.. దొంగాట



ఊసేలేని చేయూత

చేయూత పథకం కింద 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న డ్వాక్రా మహిళ లకు ప్రభుత్వం 4 విడతల్లో రూ.75వేలు ఇస్తానని హామీ ఇచ్చింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 2లక్షల 70 వేల మంది లబ్ధిదారులు న్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వారందరికీ నాలుగో విడత చేయూత కింద రూ.425 కోట్లు అందాల్సి వుంది. మార్చి 7వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పథకానికి సంబంధించి బటన్ నొక్కారు. కానీ ఈ రోజు వరకూ చాలామందికి చేయూత దక్కలేదు. దాదాపు మూడో వంతు మందికి నగదు అందలేదని తెలుస్తోంది.

తానొకటి తలిస్తే.. దైవం ఒకటి తలచిందన్నట్లుగా తయారయింది అధికార వైసీపీ పరిస్థితి. ఎన్నికల కోడ్‌కు ముందు సంక్షేమ పథకాల బటన్లు నొక్కి, సరిగ్గా ఎన్నికలు జరిగే సమయంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు బదిలీచేసి ఓటర్లకు గాలం వేద్దామనుకుంటే.. ఎన్నికల కమిషన్ ఆ కుట్రలను భగ్నం చేసింది. సీఎం జగన్‌రెడ్డి పదే పదే చెబుతున్న దేవుడి స్క్రిప్టు అదేనేమో! ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసేలా సంక్షేమ పథకాల పేరుతో నిధులు కుమ్మరించి ఓటర్లను గంపగుత్తగా కొనేయాలన్న అధికార వైసీపీ కుట్రలకు ఆ పైవాడు అలా కళ్లెం వేసినట్లున్నాడు. దీంతో సీఎం జగన్‌రెడ్డి, ఆయన అనుచర వైసీపీ నాయకగణం 'అనుకున్నది ఒక్కటి.. అయినది ఒక్కటి' అనుకుంటూ లబోదిబో మంటున్నారు.

- నొక్కింది.. ఉత్తుత్తి బటన్లేనా

- నాలుగు నెలల క్రితం బటన్లు నొక్కిన సీఎం జగన్
- సరిగ్గా ఎన్నికలు జరిగే రోజుల్లో నగదు బదిలీకి ఎత్తులు
- కోడ్ కొరడా ఝుళిపించడంతో నేడు దొంగ ఏడ్పులు
- ప్రతిపక్షాలు అడ్డుకున్నాయంటూ మొసలి కన్నీరు
- నెపం ప్రతిపక్షాలపై మోపి ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కుట్ర
- పింఛన్ల పంపిణీలోనూ అవే కుట్రలు, తప్పుడు ఆరోపణలు
- మూడు జిల్లాల్లో 10 లక్షల మంది ఎదురు చూపులు

ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లకు దాదాపు రూ.16వేల కోట్ల బిల్లులు చెల్లించారు. ఇప్పుడు చెప్పండి ఎవరిది తప్పు..? ఇదీ సోషల్ మీడియాలో ఓ వ్యక్తి ఆవేదన.

గుంటూరు,మే8 (ఆంధ్రజ్యోతి): నాడు నొక్కింది ఉత్తుత్తి బటన్లేనా?... సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార వైసీపీ పలు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు హడావుడి మొదలుపెట్టింది. ఎన్నికలు దగ్గర పడే సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆయా పథకాలను ప్రారంభించారు. జనవరి 23వ తేదీన ఆసరా పథకాన్ని ప్రారంభించిన సీఎం, మార్చి రెండోవారం నుంచి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే అవకాశం ఉండడంతో హడావుడిగా మార్చి 1న విద్యాదీవెన, మార్చి 7న చేయూత పథకాలను ప్రారంభించారు. లబ్ధిదారుల ఖాతాలకు నగదు బదిలీ చేస్తున్నట్లు బటన్లు నొక్కారు. కానీ ఇప్పటివరకూ ఆయా పథకాలకు సంబంధించిన నగదు మాత్రం లబ్ధిదారుల ఖాతాలకు బదిలీ కాలేదు. దానిని బట్టి ఆరోజున ముఖ్యమంత్రి నొక్కింది ఉత్తుత్తి బటన్లేనని తెలుస్తోంది. కాగా ఆయా పథకాలకు సంబంధించిన నగదును సరిగ్గా ఎన్నికలకు నాలుగైదు రోజులకు ముందు బదిలీ చేయాలని ప్రభుత్వ పెద్దలు భావించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం జోక్యంతో దానికి కళ్లెం పడింది.

లబ్ధిదారులను వంచిస్తూ.. తప్పుడు ప్రచారాలు



నాలుగు నెలలుగా పథకాలకు నిధులు కేటా యించకుండా ఉత్తుత్తి బటన్లతో లబ్ధిదారులను వంచించిన వైసీపీ, ఇప్పుడు ప్రతిపక్షాలపై నెపం మోపుతూ విష ప్రచారానికి తెరతీసింది. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహారం వుండడంతో ఎన్నికల సంఘం కొరడా ఝుళిపిస్తే, దానికి కారణం ప్రతిపక్షాలేనని నానా యాగీ చేస్తోంది. పింఛన్లకు నిధులు కేటాయించ కుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని దుష్ప్రచారం చేసిన వైసీపీ, ఇప్పుడు ఆసరా, చేయూత, విద్యాదీవెన పథకాల విషయంలోనూ అదే పద్ధతిని అవలంబిస్తోంది. నాలుగు నెలల క్రితం ప్రారంభించిన పథకానికి కూడా ఇప్పటి వరకూ నిధులు కేటాయించని ప్రభుత్వం, ఆ పథకాలను అడ్డుకుంటోంది ప్రతి పక్షాలే అని చెప్పడం వంచనే అవుతుంది. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను వంచించి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తోంది. తస్మాత్ జాగ్రత్త!

అడ్రస్ లేని ఆసరా

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ అర్హత పొందిన మహిళలు 7 లక్షల మంది వున్నారు. జిల్లా గ్రామీణా భివృద్ధి శాఖ (డీఆర్‌డీ ఏ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) శాఖల పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో విభజిత గుంటూరు జిల్లాలో 29,322 డ్వాక్రా సంఘాలకు చెందిన 2 లక్షల 86వేల మందికి 246 కోట్ల రూపాయలు, పల్నాడు జిల్లాలో 25,168 గ్రూపుల్లో 2,47,833 మందికి ఆసరా కింద రూ.190 కోట్ల రూపాయలు, బాపట్ల జిల్లాలో 30,604 గ్రూపులకు మూడు లక్షల మందికి రూ.263 కోట్లు ఆసరా పథకం కింద నాలుగో విడత రుణమాఫీ జర గాల్సి వుంది. నాలుగో దఫా కింద ఈ ఏడాది జనవరి 23న సీఎం ఆసరా పథకం బటన్ నొక్కారు. ఆ రోజున లబ్ధిదారులకు అక్షరాలా 700 కోట్ల రూపాయ ల రుణమాఫీ జరగాలి. కానీ ఈరోజు వరకూ అంద రికీ రుణమాఫీ డబ్బు వారి ఖాతాల్లోకి బదిలీ కాలేదు.

జగనన్న విద్యాదీవెన జాడేది?

మార్చి నెల 1వ తేదీన సీఎం జగన్మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన మూడో విడత పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని 35 వేల మంది విద్యార్థులకు రూ.41 కోట్ల ఫీజు రీ యింబర్స్‌మెంటు కింద విడుదల కావాల్సి ఉంది. సీఎం ఈ పథకానికి సంబంధించి బటన్‌నొక్కి 70 రోజులైనా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని తెలుస్తోంది. గడిచిన రెండునెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.20,450 కోట్ల రూపాయలు అప్పులు తెచ్చింది. వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లకు దాదాపు రూ.16వేల కోట్ల బిల్లులు చెల్లించింది. కానీ నాలుగు నెలల క్రితం బటన్ నొక్కిన ఆసరా, రెండు నెలల క్రితం బటన్లు నొక్కిన విద్యాదీవెన, చేయూత ఈ పథకాల లబ్ధిదారులకు మాత్రం నిధులు కేటాయించలేదు. సరిగ్గా ఇంకో నాలుగైదు రోజుల్లో ఎన్నికలు జరుగుతాయనగా ఆయా పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ నాలుగైదురోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసి ఓట్లను గంపగుత్తగా కాజేయాలని చూసింది. దీనిపై ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. అయాచిత లబ్ధి పొందేందుకు అధికార పార్టీ చేస్తున్న కుట్రగా భావించి అనుమతులు నిరాకరించింది. కథ అడ్డం తిరగడంతో వైసీపీ ప్రతిపక్షాలపై దుష్ప్రచారం మొదలు పెట్టింది.

మరమ్మతులు.. మరిచారు

రూపురేఖలు కోల్పోయిన గోవిందాపురం మేజర్ కాలువ



- సాగర్ కాలువల బాగుకు జగన్ మొండిచేయి
- మరమ్మతులకు నోచుకొని సాగర్ కాలువలు
- ఐదేళ్లుగా నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- అధ్వాన స్థితిలో కాలువలు
- నీటి తీరువాను మళ్లించుకున్న ప్రభుత్వం
- జగన్‌కు పట్టని అన్నదాతల అందోళన

నాగార్జున సాగర్ కుడికాలువల మరమ్మతులకు ప్రభుత్వం స్పందించలేదు. నిధుల కేటాయింపును విస్మరించిన జగన్ ప్రభుత్వం ఐదేళ్లుగా కాలువలను పాడుబెట్టింది. ఏటా కాలువల రిపేర్లకు జలవనరుల శాఖ పంపే ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. చివరకు నీటితీరువా నిధులను కూడా దారి మళ్లించుకొని మరమ్మతులకు మొండిచేయి చూపింది. అధ్వాన్నంగా ఉన్న కాలువలను బాగు చేయాలన్న రైతుల మొరను పెడ చెవినపెట్టింది. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో కాలువల రూపురేఖలు కోల్పోయి నీరు పారుదలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొనే జగన్ కాలువల మరమ్మతులకు నిధుల ఇవ్వకపోవడంపై ఏ సమాధానం చెబుతారు...?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాలువల్లో కంప చెట్లు పెద్దఎత్తున పెరిగాయి. జమ్ము, తూటికాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి, చాలా మైనర్లకు నీటిని సరఫరా చేసే తూములకు కనీసం షట్టర్లు లేకపోవడంతో నీటి సరఫరాలో నియంత్రణలేదు. నీటి పారుదల సమయంలో ఎక్కువగా నాచు పెరుగుతోంది. ఇది నీటి సరఫరాకు అవరోధంగా మారుతోంది. ఈ సమస్య మేజర్‌లు, మైనర్ కాలువల్లో అధికంగా ఉంటోంది. నాచు పెరిగిన వెంటనే తొలగించక పోవడంతో దిగువకు నీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదు. మరమ్మతులు తప్పనిసరి అయినా ప్రభుత్వం నిధులు విడుదలపై స్పందించలేదు. పూర్తిగా అధ్వాన్న స్థితిలో కాలువలు ఉన్నా వీటికి మరమ్మతులు చేయించేందుకు పాలకులు కృషిచేస్తున్న దాఖలాలు లేవన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పనులు గుర్తించినా.. నిధులు ఇవ్వకపాయే..

కుడికాలువ పరిధిలో ఈ ఏడాది కాలువలకు మర్మమతులు నిర్వహించేందుకు జలవనరుల శాఖ ఏటా పనులను గుర్తిస్తోంది. ఇందుకు సంబంధించిన వ్యయం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతోంది. లింగంగుంట్ల, ఒంగోలు సాగర్ కాలువల జలవనరుల శాఖ సర్కిల్ పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి వ్యయం అంచనాతో ప్రభుత్వానికి గత రెండేళ్ల వరుసగా ప్రతిపాదనలు పంపారు. నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. కట్టలు పటిష్టపరచడం, షట్టర్ల ఏర్పాటు, పూడికతీత పనులకు ప్రాధాన్యం కల్పించాల్సి ఉండగా ఈ పనులు అత్యవసరమైనా ప్రభుత్వం స్పందించక పోవడం రైతుల ప్రయోజనాలకు తూట్లు పొడిచింది.



తుర్లపాడు మేజర్‌లో పూడిపోయిన నీటిని సరఫరా చేసే తూము

నీటి తీరువా నిధులు దారి మళ్లింపు

సాగర్ కాలువల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తీరువా చెల్లిస్తారు. నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు ఐదుశాతం 80 శాతం నిధులను మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. గతంలో సాగునీటి సంఘాలు ఉండేవి. వీటికి ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. ప్రాజెక్టు కమిటీ బాధ్యతలను ఎస్సీకి, డిస్ట్రిబూటరీ కమిటీల బాధ్యతలను ఈఈలకు, నీటి సంఘాల బాధ్యతలను డీఈ, జేఈలకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆయా కమిటీల కాలువల నిర్వహణ పనులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా కమిటీల వారీగా కేటాయించాల్సి ఉంది. వసూలైన నీటి తీరువాలో 80శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. 10శాతం పరిపాలనకు వినియోగిస్తారు. 15శాతం నిధులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు ఐదేళ్లుగా జరుగుతున్న దాఖలాలు లేవు. ఇలా వచ్చిన నిధులు కాడాకు చేరుతాయి. అక్కడి నుంచి నీటి సంఘాలకు దామాషా ప్రకారం కాడా నిధులు కేటాయించాలి. నిధులు చేరకపోవడంతో మరమ్మతుల నిర్వహణ విషయంలో కాడా కూడా చేతులేత్తేసింది. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా ఏటా రూ.20 కోట్ల నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. రైతులు చెల్లించే నీటి తీరువాపై ఈ నిధులు ఆధారపడి ఉంటాయి. ఈ నిధులు కాడాకు చేరకుండా నేరుగా ప్రభుత్వం ఖజానాకు జమ అవుతున్నాయి. నీటి తీరువా నిధులు దారిమళ్లిం చడంతో కాలువల నిర్వహణకు నిధుల కొరత ఏర్పడింది. ఏటా నీటి తీరువా నిధు లు మరమ్మత్తుకు విడుదల చేసి ఉంటే కాలువలు ఇంత అధ్వానంగా ఉండేవి కాదని రైతులు చెబుతున్నారు. గత ఐదేళ్లగా నీటి తీరువా నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు చెల్లించిన నీటి తీరువా శిస్తు నిధులను కాలువల నిర్వహణకు ఖర్చు చేయకపోవడంపై రైతులు మండి పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధుల మాట ఎలా ఉన్నా తాము చెల్లించే నీటి తీరువా నిధులైనా కేటాయించి అత్యవసర మరమ్మతులైనా చేప ట్టాలని ఏటా రైతులు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు.



కాలువ కనిపించనంతగా గుర్రపుడెక్క పెరిగిన మైనర్ కాలువ

సమావేశంలో ప్రసంగిస్తున్న బ్రాహ్మణి, వేదికపై శ్రీరత్న, తదితరులు



అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- మంగళగిరి చేనేతకు గుర్తింపు కోసం లోకేశ్ తపన
- చేనేత కుల బాంధవుల ఆత్మీయ సమావేశంలో బ్రాహ్మణి

మంగళగిరి, మే 8: ఓటు ద్వారా ఐదేళ్ల అరాచక పాలనకు చరమగీతం పాడాలని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పాతమంగళగిరిలోని మునసుబుగారి రైస్‌మిల్లులో చేనేతల ఆత్మీయ సమావేశంలో ప్రసంగించారు. అధికారంలోకి రాగానే మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్న వాగ్దానానికి కట్టుబడి పనిచేస్తామన్నారు. మంగళగిరి చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని లోకేశ్ ఎంతగానో తపిస్తున్నారన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీని మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించడం వెనుక లోకేశ్ మనోగతమిదేనన్నారు. గుంటూరు లోక్‌సభ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని సతీమణి శ్రీరత్న మాట్లాడుతూ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలకు దక్కిన అవకాశం మే 13వ తేదీ అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేసేవాడే నిజమైన నాయకుడని, ఆ లక్షణాలు తనలో ఉన్నాయని లోకేశ్ నిరూపించుకున్నారన్నారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ ప్రజలిచ్చిన అధికారాన్ని రాష్ట్ర సర్వనాశనానికి వినియోగించిన జగన్‌ను ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. అంతకుముందు బ్రాహ్మణి, శ్రీరత్న, అనూరాధ దుగ్గిరాల మండలం ఈమని పంచాయతీ నల్లమేకలవారిపాలెంలోని గోపయ్యస్వామి సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయం, శ్రీకృష్ణుడు, నాగేంద్రస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలలు చేశారు. అనంతరం పాతమంగళగిరిలోని అనీషా ఖాదిరి దర్గాలో బ్రాహ్మణి ఛాదర్ సమర్పించారు. ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు, బాప్టిస్టుపేట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పద్మశాలీయ సంఘ ప్రముఖులు, టీడీపీ నాయకులు గుంటి నాగరాజు, ఆకురాతి నాగేంద్రం, జొన్నాదుల బాలకృష్ణ, మునగాల శ్రీనివాసరావు, మంద్రు రాము, తమ్మిశెట్టి జానకీదేవి, నందం అబద్ధయ్య, వింజమూరి ఆషాబాల, ఉద్దంటి గాంధీ, ఉద్దంటి పద్మావతి, అవ్వారు కృష్ణారావు, ఊట్ల శ్రీమన్నారాయణ, మహమ్మద్ ఇబ్రహీం, షేక్ సుభానీ, జగ్గారపు రాము, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, మున్నంగి శివశేషగిరిరావు, బట్టు చిదానందశాస్త్రి, కోసూరి రాజశేఖరరావు, దామర్ల పద్మజ, ఊట్ల దుర్గామల్లీశ్వరి, గుత్తికొండ ధనుంజయరావు, జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతీరావు, షేక్ సుభానీ, జంజనం వెంకట సాంబశివరావు, టీడీపీ నాయకులు గాజుల శ్రీనివాసరావు, పెండెం శివరామకృష్ణ, కొదమల సైమన్, పోలుమట్ల ప్రేమ్‌కుమార్, వెలగపాటి విలియం, బుల్లా కోటి, బుల్లా శివకుమార్, మాతంగి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపు రాష్ట్రానికి మేలు


వేల్పూరు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు

- టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు
- జీవీ ఆంజనేయులుతో కలసి ఎన్నికల ప్రచారం
- మేళతాళాలు, హారతులతో బ్రహ్మరథం పట్టిన ప్రజలు

శావల్యాపురం, మే 8: రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దగలిగిన ఏకైక నాయకుడు చంద్రబాబు మాత్రమేనని, భావితరాల భవిష్యత్తు కోసం ప్రజలంతా కూటమిని గెలిపించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శావల్యాపురం మండలంలోని కొత్తలూరు, తుమ్మలకుంట, వేల్పూరు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లిఖార్జునరావులతో కలసి మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు బారీగా తరలివచ్చి నేతలకు బ్రహ్మరథం పట్టారు. మేళతాళాలతో ఎదురెళ్లి మహిళలు హారుతులిచ్చి ఘనస్వాగతం పలికారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ప్రజలందరికీ ఆదర్శంగా ఉంటూ స్వగ్రామమైన వేల్పూరుకు పేరుప్రఖ్యాతులు తేవాల్సిన బొల్లా ప్రెస్‌మీట్‌లలో మహిళలు, చిన్నారులు వినకూడని బూతులుతిడుతూ వేల్పూరు పరువు ప్రతిష్ఠలను దిగజార్చుతున్నాడని అన్నారు. ప్రతిపక్ష నాయకుల కుటుంబాల గురించి మాట్లాడుతుంటే వద్దన్నానని తనపైనే సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశాడని, ఇటువంటి ఎమ్మెల్యే మనకు అవసరమా అని ప్రశ్నించాడు. డబ్బుందన్న అహంకారంతో విర్రవీగుతున్న బొల్లాను సొంతపార్టీ నాయకులు, కార్యకర్తలే అసహ్యించు కొంటున్నారన్నారు. గత ఎన్నికల్లో వేల్పూరులో బొల్లా కంటే ప్రజలు తనకే ఎక్కువ మెజారిటీ నిచ్చారని, మరోసారి తనను, జీవీని ఆదరించాలని కోరారు. జీవీ మాట్లాడుతూ సొంత గ్రామమని గొప్పలు చెప్పుకొనే బొల్లా వేల్పూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఒక్కరికైనా ఇళ్ళుగానీ, సబ్సిడీ రుణాలుగానీ ఇచ్చాడా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రతిగ్రామంలో బ్రోకర్లను పెట్టుకొని పేదలకందించాల్సిన రేషన్ బియ్యం అమ్ముకొంటున్నాడని, ప్రతిగ్రామంలో బెల్టుషాపులు పెట్టించి మద్యాన్ని ఇంటింటికీ డోర్ డెలివరీ చేయిస్తున్నాడన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక బొల్లా చేసిన అక్రమాలను బట్టబయలు చేసి జైలుకు పంపడం ఖాయమన్నారు.


మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

మక్కెన మాట్లాడుతూ జగన్ ఓడిపోతే సంక్షేమ పథకాలు నిలిచి పోతాయని వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, సంక్షేమ పథకాల స్ఫూర్తిప్రదాత ఎన్టీఆర్ అని, ఆయన స్ఫూర్తితోనే చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టాడన్నారు. ఇదే వేల్పూరులో రైతును చెప్పుతో కొట్టడమే కాక కేసు పెట్టించి జైలుకు పంపిన గొప్ప సంస్కృతి బొల్లాద న్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో జిల్లా మొత్తంలో శావల్యాపురం జడ్పీటీసీగా వేల్పూరు టీడీపీ అభ్యర్థి హైమావతి గెలుపొందిన విషయాన్ని బొల్లా గుర్తుంచుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగిన అభ్యర్థులు లావు, జీవీలను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. జడ్పీటీసీ పారా హైమావతి, టీడీపీ మండల అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, బొల్లా పేరయ్య, యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాథం, గద్దె వీరమస్తాన్‌రావు, గోరింట్ల హనుమంతరావు, ఏగినాటి తిరుపతిరావు, దొడ్డా ఏడుకొండలు, సాదినేని కృష్ణమూర్తి, బోయపాటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరులో ప్రచారానికి తరలివచ్చిన జనసందోహం

జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనం


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కొత్తపల్లి జవహర్

- మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్

అమృతలూరు, మే 8: జగన్మోహనరెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రం అమృతలూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో టీడీపీ నాయకుడు మట్లపూడి జయపాల్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో జవహర్ మాట్లాడుతూ మన బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. దళితుడుని హత్య చేసి ఇంటికి డోర్ డెలివరి చేసిన ఘనులు వైసీపీ ఎమ్మెల్సీ అన్నారు. హత్య చేసిన వ్యక్తిని జగన్మోహనరెడ్డి అందలం ఎక్కించాడంటే అతని నైజం తెలుసుకోవాలన్నారు. పేదలకు పెన్షన్ తీసుకు వచ్చిన పార్టీ టీడీపీయేనన్నారు. గతంలో రూ.200 ఉన్న పెన్షన్‌ను చంద్రబాబునాయుడు రూ.2000కు పెంచితే జగన్మోహనరెడ్డి 4 విడతల్లో మూడు వేలు చేశాడని చెప్పారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే ఏప్రిల్ నుంచే రూ. 4 వేలు పింఛన్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. దళితులకు చెందిన 27 సంక్షేమ పథకాలను జగన్మోహనరెడ్డి రద్దు చేశాడని, చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే వాటిని తిరిగి పునరుద్ధరిస్తారని అన్నారు. మాదిగ, మాల సామాజికవర్గాలు తనను రెండు కళ్లుగా చంద్రబాబు చెప్పారన్న విషయాన్ని గుర్తుచేశారు. గ్రేస్ ఫౌండేషన్ అధ్యక్షుడు షాలెంరాజ్ మాట్లాడుతూ దళితులకు సీఎం జగన్ తీవ్ర అన్యాయం చేశాడని, ఈ ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థులను ఓడించి, కూటమి అభ్యర్థు లను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, పాములపాటి వెంకటసుబ్బారావు, మూల్పూరు ఏసురత్నం, మాథ్యూస్, మూల్పూరు మాణిక్యారావు, కూచిపూడి వెంకటేష్, రమేష్, టీడీపీ, తదితరులు పాల్గొన్నారు.

జనమంతా ఓ వైపు.. జగన్ ఓ వైపు


వంగవీటి రాధాకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కూటమి శ్రేణులు

- ప్రజలు కూటమిని గెలిపించాలనే సంకల్పంతో ఉన్నారు
- శ్రీకృష్ణదేవరాయులు, అరవిందబాబులు ఎంతో మంచి నేతలు
- ఎన్నికల ప్రచారంలో వంగవీటి రాధా

నరసరావుపేట టౌన్, మే 8: జనం అందరూ ఒక వైపు ఉన్నారు, జగన్ ఒక వైపు ఉన్నారు, తప్పకుండా తీర్పు జనం వైపు ఉంటుందని దివంగత వంగవీటి మోహనరంగ తనయుడు వంగవీటి రాధా అన్నారు. గురువారం నరసరావుపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ర్యాలీ జరిగింది. జొన్నలగడ్డ సాయిబాబా ఆలయం నుంచి సత్తెనపల్లి రోడ్డు రంగా విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు రాధాకు టీడీపీ శ్రేణులు గజమాలతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన రాధా మట్లాడుతూ కూటమిని గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సంకల్పంతో ఉన్నారని, ఇది పార్టీ కూటమి మాత్రమే కాదని, ప్రజా కూటమి అని అన్నారు. ఈ ప్రాంతంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు మంచి పేరుందని, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సౌమ్యులని, వారిని ప్రజలు గెలిపిస్తారని అన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తూ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామ చంద్రప్రసాదు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, సయ్యద్ జిలాని, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు. ముందుగా జనసేన కార్యకర్తలు పట్టణంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

ముగ్గురు ఖాకీలపై వేటు


కారంపూడి సీఐ చిన మల్లయ్య


మాచర్ల సీఐ శరత్‌బాబు


వెల్దుర్తి ఎస్సై వంగా శ్రీహరి

- పల్నాడులో ఇద్దరు సీఐలు ఒక ఎస్ఐ విధుల నుంచి తప్పుకోవాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు
- ఖాకీ ధరించి వైసీపీ కార్యకర్తల్లా పనిచేసినందుకు పర్యవసానం

గుంటూరు,మే8: రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటైన పల్నాడులోని మాచర్లలో ముగ్గురు పోలీసులపై ఎన్నికల కమిషన్ వేటువేసింది. ఖాకీ ముసుగులో వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నందుకు పర్యవసానంగా ఇద్దరు సీఐలు, మరో ఎస్ఐని విధుల నుంచి తప్పించింది. మాచర్ల టౌన్ సీఐ శరత్‌బాబు, కారంపూడి సీఐ చిన్న మల్లయ్య, వెల్దుర్తి ఎస్ఐ వంగా శ్రీహరిలపై బదిలీ వేటు వేసింది.

అకారణంగా తుపాకితో బెదిరింపు..

ఆరు నెలల క్రితం కారంపూడి సీఐగా బాధ్యతలు స్వీకరించిన చిన్న మల్లయ్య తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలే లక్ష్యంగా విధులు నిర్వహించారు. ఇటీవల కారంపూడిలోని టీస్టాల్ వద్ద టీ తాగుతున్న దివ్యాంగుడిని చిన్న మల్లయ్య అకారణంగా కొడుతుండడంతో అక్కడే ఉన్న టీడీపీ నాయకుడు చప్పిడి రాము ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా నీకోసమే చూస్తున్నాను అంటూ తన తుపాకీ బయటకు తీసి రాముని బెదిరిస్తూ చొక్కా పట్టుకొని ఈడ్చి జీపులో స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ ముట్టడికి వెళ్లడంతో గత్యంతరం లేక వదిలేశాడు. ముఖ్యంగా చిన్న మల్లయ్య టీడీపీ కార్యకర్తలను స్టేషన్‌కు పిలిపించి బెదిరించడం, తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపుతానని వేధింపులకు పాల్పడం వంటి అనేక అక్రమాలకు పాల్పడ్డారు. ఇటీవల మిరియాల గ్రామంలో టీడీపీ నాయకుడు జంగా కృష్ణమూర్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయితే జంగాని గ్రామానికి ఆహ్వానించిన భక్తుల శ్రీనివాస్ యాదవ్ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ట్రక్కులోని వరిగడ్డికి వైసీపీ నాయకులు నిప్పు పెట్టారు. దీనిపై బాధితులు శ్రీనివాస్ యాదవ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా సీఐ స్పందించలేదు. అయితే టీడీపీ వారిపై మాత్రం తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేశారు.

హత్యాయత్నం కేసులు బనాయింపు..

మాచర్ల టౌన్ సీఐ శరత్ బాబు చట్టాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారు. ఇటీవల మాచర్ల పట్టణంలోని ముస్లిం బజార్లో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి రాకను స్వాగతిస్తూ పార్టీ కార్యకర్తలు ఫ్లెక్సీలు కడుతుండగా వారిపై వైసీపీ కార్యకర్తలు నాయకులు కర్రలతో దాడి చేసి కొట్టారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేస్తే కనీసం తీసుకోకపోగా వైసీపీ వారి నుంచి ఫిర్యాదు తీసుకొని పదిమంది టీడీపీ కార్యకర్తలపై హత్యాయత్నం సెక్షన్ల కింద కేసులు బనాయించి వారిని అరెస్టు చేసి జైలుకు పంపేందుకు ప్రయత్నించారు అయితే వారు ముందస్తు బెయిలు పొందడంతో కొంతవరకు ఉపశమనం కలిగింది. ఇటీవల మాచర్ల పట్టణంలో టీడీపీ కార్యకర్త ఎర్ల సురేష్‌కు చెందిన కారును వైసీపీ నాయకులు పెట్రోల్ పోసి తగలబెట్టారు. అయితే కారు తగలబెట్టించిన వైసీపీ నాయకులను వదిలేసి నిప్పుపెట్టిన ముగ్గురు కార్యకర్తలతో కేసు నమోదు చేసి వారికి కూడా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ఎన్నికల ప్రచారానికి టీడీపీ ఎంపీ అభ్యర్థి సంబంధించిన ప్రచార వాహనం పట్టణంలోకి రాగా దానిని చుట్టుముట్టి అందులో వచ్చిన వారిని బయటకు తీయకుండా వాహనాన్ని కదలకుండా రెండు గంటలేసేపు ఇబ్బందిలకు గురిచేశాడు.

ఖాకీలకే కళంకం..

వెల్దుర్తి ఎస్ఐ వంగ శ్రీహరి ఖాకీ డ్రస్సుకే కళంకం తెచ్చేదా వ్యవహరించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలే లక్ష్యంగా తప్పుడు కేసులతో వారిని వెంటాడి వేటాడారు. మాచర్ల నియోజకవర్గంలో అసలు పోలీసులు ఉన్నారా అనే సందేహం కలిగేలా వీరు వ్యవహరించారు. ఎస్ఐ శ్రీహరి వేధింపుల కారణంగా టీడీపీకి చెందిన మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలన సృష్టించిన గుల్లపాడు గ్రామంలో టీడీపీ నాయకుడు తోట చంద్రయ్యను వైసీపీ వర్గీయులు దారుణంగా హత్య చేస్తే వారిని వదిలేసి, టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించారు. కాటన్ సెర్చ్ పేరుతో టీడీపీ నాయకులు కార్యకర్తల ఇళ్లల్లో తనిఖీలు చేసి తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేశారు అదేవిధంగా గొట్టిపాట్ల గ్రామంలో టీడీపీ నాయకులు ఊరు వదిలి వెళ్ళేలా వేధింపులకు పాల్పడ్డారు. చట్టాన్ని అతిక్రమించేలా వ్యవహరించిన ఇద్దరు సీఐలు, మరో ఎస్ఐపై బదిలీ వేటు వేయడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే మాచర్ల నియోజకవర్గ ప్రజలు మాత్రం ఈ ముగ్గురు పోలీసుల బదిలీపై ఊపిరి పీల్చుకున్నారు.

ఒక వైపు ఎన్‌ఆర్‌ఐలు.. మరోవైపు టెకీలు

- భారీ సంఖ్యలో తరలిరానున్న ఓటర్లు
- రవాణ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్న పార్టీల నేతలు
- ఈ దఫా ఎన్నికల్లో భారీ ఓటింగ్ శాతం ఖాయం

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ లేని విధంగా ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు రూ.లక్షలు ఖర్చు పెట్టి ఫ్లయిట్ టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొని మరీ ఎన్‌ఆర్‌ఐలు వస్తున్నారు. ఇప్పటికే వారిలో కొంతమంది స్వస్థలాలకు చేరుకోగా శని, ఆదివారోల్లు మరింత ఎక్కువ సంఖ్యలో రానున్నారు. ముఖ్యంగా యూఎస్‌ఏ నుంచే 2 వేల మంది ఎన్‌ఆర్‌ఐలు తరలి వస్తున్నట్లు సమాచారం. సింగపూర్ నుంచి స్పెషల్ ఫ్లయిట్‌లో వందల సంఖ్యలో వస్తున్నారు. మరోవైపు హైదరాబాద్ నుంచి అయితే వేల సంఖ్యలోనే ఓటర్లు జిల్లాకు వచ్చేందుకు రవాణ సదుపాయాలు కూడా ఏర్పాటు చేసుకొన్నారు. అలానే బెంగళూరు, చెన్నై నగరాల్లో ఉద్యోగ, ఉపాధి, ఉన్నత చదువులు రీత్యా ఉంటున్న టెకీలు కుటుంబ సమేతంగా వచ్చేందుకు రైళ్లు, బస్సుల్లో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్నారు. ఎవరైతే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోలేక పోయారో వారి కోసం బస్సులు ఏర్పాటు చేసేందుకు కొంతమంది నేతలు బాధ్యతలు తీసుకొన్నట్లు సమాచారం.

ఉద్యోగ, ఉపాధి రీత్యా విదేశాలకు వెళ్లినా చాలామంది తమ మాతృ ప్రదేశం అభివృద్ధి చెందాలని కోరుకొంటున్నారు. అమరావతి రాజధానిని వైసీపీ ప్రభుత్వం గొంతు నులిమేసినప్పుడు విదేశాలు, జంట నగరాల్లో పెద్దఎత్తున నిరశన ప్రదర్శనలు కొనసాగించారు. అలానే మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేసినప్పుడు వందకు పైగా దేశాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జంట నగరాల్లో అయితే శిబిరమే ఏర్పాటుచేసి వైసీపీకి వ్యతిరేకంగా ఉద్యమించారు. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు తమకు ఎప్పుడు అవకాశం వస్తుందా అని అంతా ఎదురు చూశారు. ఇన్నాళ్లకు వారికి సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధం రూపంలో రావడంతో దానిని వినియోగించుకొ నేందుకు సంసిద్ధమయ్యారు.

కాగా తాత్కాలికంగా ఉద్యోగ, ఉపాధి రీత్యా హైదరాబాద్, బెంగళూరులో నివసిస్తున్న సాఫ్టువేర్ ఇంజనీర్లు, ఇతర సాంకేతిక నిపుణులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు తొలగించేందుకు వైసీపీ నేతలు విశ్వప్రయత్నం చేశారు. తప్పుడు ఫారం-7లు పెట్టి ఈఆర్‌వోలపై ఒత్తిడి తీసుకొచ్చారు. వాటన్నింటిని ఇక్కడి ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టారు. ఓటు తొలగించినా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత మరోసారి ఓటరు నమోదుకు దరఖాస్తు పెట్టించారు. కోడ్ అమల్లోకి వచ్చాక అధికారులు వైసీపీ నేతలకు అంటకాగడం తగ్గించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకొన్నారు. దీంతో చాలామంది ఓట్లు జాబితాల్లో పదిలంగా ఉన్నాయి. దాంతో ఆయా ఓటర్లంతా ఈ నెల 13వ తేదీన జిల్లాకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకొన్నారు. ఆ రోజున ఎంత ఎండ ఉన్నా లెక్క చేయకుండా ఓటు వేస్తామని స్పష్టం చేస్తున్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్రాన్ని మాఫియా కేంద్రంగా మార్చిన జగన్
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ఎంతో ప్రమాదం ..
- టీడీపీ తెలంగాణ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన

పొన్నూరుటౌన్, మే8: ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా దిగజారిపోయిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలని తెలంగాణ సెటిలర్స్ ఫోరం కన్వీనర్, తెలంగాణ టీడీపీ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన అన్నారు. కూటమి అభ్యర్థులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్ల తరపున ప్రచారం కోసం సొంత ప్రాంతం పొన్నూరు వచ్చిన మాజీ ఎమ్మెల్యే ప్రసూన బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని ల్యాండ్, శ్యాండ్, గంజాయి, డ్రగ్స్‌కు మాఫియాగా మార్చారని ధ్వజమెత్తారు. తాను పొన్నూరు ప్రాంతంలలో పుట్టి పెరిగానని అన్నారు. ఆచార్య ఎన్జీరంగా, యడ్లపాటి వెంకట్రావు లాంటి మహనీయుల సహచర్యంలో చిన్న వయస్సులోనే రాజకీయాలోకి అడుగు పెట్టినట్టు చెప్పారు. 22 ఏళ్లకే అతి చిన్న వయస్సులో ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించినట్లు చెప్పారు. తనకు రాజకీయ ఓనమాలు దిద్దించిన పుట్టిగడ్డ ఆంధ్రప్రాంతం సమస్యలతో సతమతమవుతుంటే చూస్తూ ఊరుకోలేకపోయినట్లు చెప్పారు. అలాగే వంశపార్యపరంగా సంక్రమించిన భూములు జగన్ రెడ్డి తెచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌తో ప్రమాదంలో పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో నివశిస్తున్న సెటిలర్స్‌లలో ఈ చట్టంపై ఆందోళనలు ఉన్నాయన్నారు. పొన్నూరులో ధూళిపాళ్ళ కుటుంబానికి మంచి పేరు వుందన్నారు. అలాంటి నరేంద్ర కుమార్‌ను అక్రమ కేసులు పెట్టి ప్రభుత్వం వేధింపులకు గురి చేసిందని ఆరోపించారు. నరేంద్ర కుమార్‌ను గెలిపించుకొని పొన్నూరు ప్రగతిని బాటుల వేసుకోవాలని కాట్రగడ్డ ప్రసూన పిలుపునిచ్చారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర టీడీపీ ఉపాధ్యాక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

మరొక్క రోజు గడువు ఇవ్వండి

- ఉద్యోగుల విజ్ఞాపనలను ఆర్‌వో దృష్టికి తీసుకువెళ్లిన పెమ్మసాని

గుంటూరు (కార్పొరేషన్), మే 8: ఉద్యోగులకు మరొక్క రోజు పోస్టల్ బ్యాలెట్‌కు గడువు పెంచాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు నగరంలోని మహిళా కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పెమ్మసాని బుధవారం పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న విధానాన్ని ఆయన పర్యవేక్షించారు. ఉద్యోగ ఓటర్లను కలుసుకొని పోలింగ్ విధానంపై ఏదైనా అభ్యంతరాలు ఉన్నాయా? అని అడిగితెలుసుకున్నారు. తొలిరోజు ఎదురైన సమస్యలపై ఓటర్లు వ్యక్తంచేసిన అభ్యంతరాలను ఈ సందర్భంగా ఉన్నతాధికారుల దృష్టికి పెమ్మసాని తీసుకువెళ్లారు. పార్లమెంట్ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు, ఎక్కడ పనిచేస్తు అక్కడే ఓటువేయాలని నియమ నిబంధనలను సడలించి పార్లమెంటు పరిధిలోని ఏదైనా ప్రాంతంలో ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్న ఉద్యోగుల విజ్ఞాపనలను పరిగణనలోకి తీసుకోవాలని ఈసందర్భంగా ఉన్నతా ధికారులకు ఆయన తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ తొలిరోజు ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, పోలింగ్‌కు మరొక రోజు అదనంగా గడువు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎన్నికల అధికారులను పెమ్మసాని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు పోతురాజు సమత, ఈరంటి వరప్రసాద్, వేములపల్లి శ్రీరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తులు

తెనాలి అర్బన్, మే 8 : జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం కోసం మొదటి విడత ప్రవేశాలకు జూన్ 10 లోగా దరఖాస్తు చేయాలని చెప్పారు. ఐటిఐఏపీజీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ తెనాలి, గుంటూరులో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలోనూ సర్టిఫికెట్లతో ఈ నెల 9 నుంచి సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని, అభ్యర్థులు జూన్ 18 నుంచి 26 లోగా జరిగే కౌన్సిలింగ్‌కు తెనాలి, గుంటూరు ఐటిఐలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

మందడం యువకుడు ఐఎఫ్ఎస్‌కు ఎంపిక

- తుమ్మల కృష్ణ చైతన్యకు జాతీయ స్థాయిలో 74వ ర్యాంకు


తుమ్మల కృష్ణచైతన్య

గుంటూరు(విద్య), మేడికొండూరు, మే8: జాతీయ స్థాయిలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన ఫలితాల్లో జిల్లాకు చెందిన తుమ్మల కృష్ణచైతన్య సత్తాచాటారు. తుళ్లూరు మండలం, మందడం గ్రామానికి చెందిన తుమ్మల కృష్ణ చైతన్య ఇండియన్ ఫారెస్ట్ సర్వీసుకు ఎంపికయ్యారు. బుధవారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ విడుదల చేసిన ఫలితాలలో 74వ ర్యాంక్ సాధించారు. దేశ వ్యాప్తంగా 147మంది ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించగా కృష్ణ చైతన్య 74వ ర్యాంక్ సాధించారు. కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన తుమ్మల రాజారావు, సుజాత దంపతుల కుమారుడు కృష్ణ చైతన్య ప్రస్తుతం రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలు, వాణిజ్య విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

అమరావతి ద్రోహులకు తగిన గుణపాఠం చెప్పాలి

- 1604వ రోజుకు ఆందోళనలు ..


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు మే 8: అమరావతి ద్రోహులకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని రాజధానికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి రైతులు రైతుకూలీలు , మహిళలు చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు బుధవారం నాటికి 1604వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజధాని అమరావతికి ఒక్క రూపాయి తీసుకోకుండా తాము భూములు ఇస్తే, ఆ ప్రాంత రైతుల ప్రజల అభిప్రాయం తీసుకోకుండా జగన్‌రెడ్డి మూడు రాజధానులను ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ప్రజలంటే లెక్కలేని ఈ ప్రభుత్వానికి ఈ ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని, వైసీపీకి ఓటు వేయవద్దని విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి , జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00

70,776 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 57,850 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 70,776 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 42,624 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	18000
నెంబరు. 5	9000	14000
273	10500	14000
341	9000	17000
4884	9000	14000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8500	16000
దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	5000	11500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పెమ్మసాని సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజవరపు శ్రీనివాసరావు

టీడీపీలో చేరిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

● కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన డాక్టర్ పెమ్మసాని

గుంటూరు(కార్పొరేషన్), మే 8 : వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైసీపీ రాష్ట్ర శాలివాహన సంఘం ప్రధాన కార్యదర్శి రాజవరపు శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం ఈ మేరకు గుంటూరు టీడీపీ పార్లమెంటరీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పార్టీలోకి శ్రీనివాసరావుని ఆహ్వానించారు. మెడలో పార్టీ కండువా వేసి ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీలో శ్రీనివాసరావుతో పాటు ఆయన అనుచరులు మరో వంద మంది పార్టీలో చేరారు. వారందరినీ కూడా డాక్టర్ పెమ్మసాని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, అభ్యర్థుల గెలుపునకు శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఏటీ అగ్రహారం ప్రాంతంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తెస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బటన్ నొక్కి అలిసిపోయిన జగన్‌కు సెలవిద్దాం

● టీడీపీ నాయకుడు వంగవీటి రాధా

గుంటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): బటన్ నొక్కి నొక్కి అలిసిపోయిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఇక సెలవు ఇద్దామని రాష్ట్ర ప్రజలకు టీడీపీ నాయకుడు వంగవీటి రాధా పిలుపునిచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని శ్రీనివాసరావుపేటలో బుధవారం ఆయన పర్యటించారు. గుంటురు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి, ఎన్డీయే కూటమి నేతలతో కలిసి వంగవీటి రాధా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వైసీపీ రాష్ట్ర ప్రజలను కులాలు, మతాలవారీగా విడగొట్టిందని ఆరోపించారు. కాపులందరూ కలిసికట్టుగా ఉన్నామని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ ఎన్నికల్లో ఇచ్చే తీర్పు భావితరాలకు ఉజ్వల భవిష్యత్తునిస్తుందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి గల్లా మాధవిని గెలిపించాలని కోరారు. ఇప్పటికే కూటమి అభ్యర్థుల విజయం పక్కా అన్నారు. చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమన్నారు. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ విభజించు పాలించు తరహాలో జగన్ పాలన ఉందని ఆరోపించారు. కుటుంబ సభ్యుల మద్దతే వైసీపీకి లేదని ఎద్దేవా చేశారు. రేపు తన గెలుపు నిజాయితీ వైపు ఉంటుందని స్పష్టం చేశారు. తన కుటుంబం రోజురోజుకూ పెరిగిపోతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లెల రాజేష్ నాయుడు, ఉగ్గిరాల సీతారామయ్య భీమనాధం భరత్‌రెడ్డి, గల్లా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంగవీటి రాధా

కూటమిపై వైసీపీ దుష్ప్రచారం దుర్మార్గం

టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసుప్రసాద్

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ-బీజేపీ-జనసేన పొత్తుపై అధికార పార్టీ నేతలు సామాజిక మాధ్యమాల ద్వారా క్రైస్తవులలో దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిపాటి యేసు ప్రసాద్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే క్రైస్తవులపై మణిపూర్‌లో జరిగినట్లు దాడులు మన రాష్ట్రంలో కూడా జరుగుతాయని భయాందోళనలు కల్పించడం హేయమైన చర్య అని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు క్రైస్తవులు, క్రైస్తవ సంఘాలకు అండగా ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సెమి క్రిస్మస్ కార్యక్రమాలు నిర్వహించడం, క్రిస్మస్ కానుకలు పంపిణీ చేయడం, చర్చిల మరమ్మతులకు సహాయం చేయడం, నూతనంగా చర్చిలు నిర్మించుకునేవారికి నిధులు కేటాయించడం వంటి అనేక కార్యక్రమాలు చంద్రబాబు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. 2018-19 సంవత్సరంలో క్రైస్తవుల అభివృద్ధి కోసం చంద్రబాబు 110 కోట్లు కేటాయించారన్నారు. గుంటూరు నగరంలో క్రిస్టియన్ భవన్ కొరకు 2 ఎకరాల భూమి కేటాయించి వెనువెంటనే 10 కోట్లు నిధులు కేటాయించారన్నారు. క్రిస్టియన్ భవన్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తవగా... జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా క్రిస్టియన్ భవన్‌ని నిర్లక్ష్యంగా వదిలేశాడని విమర్శించారు. జగన్ రెడ్డి పాలనలో క్రైస్తవులకు ఎటువంటి ప్రోత్సాహం అందలేదని, కేవలం ఎన్నికల్లో గెలుపు కోసం అధికార పార్టీ నాయకులు టీడీపీ మీద దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. క్రైస్తవులెవరూ వైసీపీ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. చంద్రబాబు గెలుపు కోసం క్రైస్తవులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు కారంగి అనీల్ కుమార్, నీలం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విజయవాడలో జరిగే ఇండియా కూటమి సభ

● డీసీసీ అధ్యక్షుడు లింగంశెట్టి

గుంటూరు, మే 8: ఇండియా కూటమి ప్రచారంలో భాగంగా శుక్రవారం విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే ఇండియా కూటమి సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీభవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో జరిగే సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే హాజరవుతున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమి విజయ సాధిస్తేనే దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. విలేకరుల సమావేశంలో గుంటూరు పశ్చిమ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, బిళ్ళా సునీల్‌కుమార్ తదితరులున్నారు.

సిజేరియన్ సర్జరీలు చేసిన ఆసుపత్రులకు నోటీసులు

గుంటూరు (మెడికల్) మే 8 : జిల్లాలోని 100 శాతం సిజేరియన్ కాన్పులు జరిగిన ప్రైవేటు వైద్యశాలలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సందర్శించి అలా జరగడానికి గల కారణాలను సమీక్షించి నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి బుధవారం సంబంధిత ప్రోగ్రామ్ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. అవసరం లేకున్నా సిజేరియన్ ఆపరేషన్ చేసినట్లు గుర్తిస్తే అటువంటి ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

వెంగళాయపాలెం రాజీవ్‌గాంధీ కాలనీలో అంధకారం

గుంటూరు, మే 8 : ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామంలోని రాజీవ్ గాంధీ కాలనీవాసుల మంగళవారం రాత్రి విద్యుత్ లేక అంధకారంలో అల్లాడిపోయారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కరెంటు వైర్లు, స్తంభాలు నేలకొరిగాయి. గత రెండు సంవత్సరాలుగా కరెంటు సమస్యలపై ఆ కాలనీవాసులు ఎన్ని లేఖలు సమర్పించుకున్నప్పటికీ విద్యుత్ అధికారులు అలసత్వంతో వాటిని పట్టించుకోలేదదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లేకపోవటంతో మోటార్లు పని చేయక నీరు లేక పలు ఇబ్బందులకు గురయ్యారు.

ఎన్నికలు సజావుగా జరగాలంటే సీఎస్‌ను బదిలీ చేయాలి : పాతర్ల

తాడేపల్లి, మే 8: రాష్ట్రంలో టీడీపీ కూటమి అభ్యర్థులపై వైసీపీ దాడు లు పెరిగిపోయాయని, ఎన్నికలు సజావుగా జరగాలంటే సీఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వ్యవస్థలను భ్రష్టుపట్టించి, ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే జగన్ చేస్తున్న ప్రయత్నాలకు ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట వేయడంతో జగన్ దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇదే క్రమంలో వైసీపీకి మద్దతుగా వ్యవహరిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డిని కూడా బదిలీ చేస్తే రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగే అవ కాశం ఉందన్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని, రాష్ట్రంలో మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సమస్యాత్మక ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసీపీలో స్పష్టంగా ఓటమి భయం

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డిలో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి ఎద్దేవా చేశారు. గుంటూరు 49, 52 డివిజన్లలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుంటూరు వేళాంగిణి నగర్, పొట్టి శ్రీరాములు నగర్‌లో జోన్ 5 టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు తాడిశెట్టి మురళి, మద్దిరాల మ్యాని, కసుకుర్తి హనుమంతరావులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ అస్తవ్యస్తమైన, దిక్కుమాలిన పాలనపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను ఊహించి ముందే ఓటమిని అంగీకరిస్తున్నాడన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్లుగా రాష్ట్రాన్ని, రాష్ట్ర వనరులను నాలుగు లక్షల కోట్లకు దోచుకున్నాడని ఆమె ఆరోపించారు. ఇప్పటికే 10 లక్షల కోట్ల అప్పులు చేశాడని, అసలు గతంలో ఎప్పుడైనా ప్రభుత్వ ఉద్యోగులు జీతం కోసం ఎదురుచూసే రోజులు ఉన్నాయా, కానీ జగన్ రెడ్డి వచ్చాక ఉద్యోగులు జీతం మహాప్రభో అని మొరపెట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. జగన్‌రెడ్డికి ప్రజా శ్రేయస్సు ఏమాత్రం పట్టదని, తన కుటుంబం, తన ఆదాయం తప్ప మరో ఆలోచన ఉండదని మాధవి విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవల్లి, తెలగతోటి సుధీర్, మర్రిపాటి శ్రీనివాస్, మునగ నూకాలమ్మ, కన్నసాని బాజీ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో గల్లా మాధవి, కోవెలమూడి రవీంద్ర, తాడిశెట్టి మురళి

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ బుధవారం గల్లా మాధవికి తోడుగా నిలిచారు. ఆమెతోపాటు ఆయన కూడా ఓటర్లను కలిసి టీడీపీ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు.

పేదల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ రావాలి

● తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నసీర్



ఎన్నికల ప్రచారంలో నసీర్, ఉండవల్లి శ్రీదేవి తదితరులు

గుంటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం శారదా కాలనీలో తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవితో రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో నసీర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. పేద ప్రజలకు అందరికీ ఉపయోగపడేలా మూడు పార్టీలు కలిసి ప్రజా మేనిఫెస్టోను రూపొందించాయన్నారు. గుంటూరు తూర్పులో పదేళ్లలో అసమర్థ ఎమ్మెల్యే ముస్తఫా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసి, తన కుటుంబ సంపద పెంచుకోవడానికి ప్రజా ఆస్తులని కబ్జా చేసుకుంటూ, ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. నెల రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు అమలు చేయబోయే సంక్షేమ పథకాలు గురించి వివరించారు. చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా మేనిఫెస్టో తయారు చేశారని తెలిపారు. జూన్ నెల నుంచి మహిళలందరూ ఉచిత బస్సు ప్రయా ణం చేసే విధంగా చంద్రబాబు అవకాశం కల్పించనున్నారని తెలిపారు. అలాగే అందరికీ ఆర్థిక భారం తగ్గించేందుకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నారు. ప్రతి కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఏడాదికి రూ.15000 చొప్పున తల్లికి వందనం పథకం ద్వారా చంద్రబాబు అందించబోతున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకునేందుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులైన తనను, పెమ్మసాని చంద్రశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భారతి, క్లస్టర్ మహంకాళి నరసింహారావు, పఠాన్ బాజీ, జనసేన నాయకురాలు బిట్రగుంట్ల మల్లికా, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

నసీర్ సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు

గుంటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అవినీతి, అక్రమాలు చూడలేక విసుగెత్తి వైసీపీ శ్రేణులు టీడీపీలోకి వస్తున్నాయని గుంటూరు తూర్పు కూటమి అభ్యర్థి నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గం ఐదో వార్డు రామిరెడ్డితోటలో మాజీ కార్పొరేటర్, వైసీపీ ముఖ్యనాయకుడు ఉప్పలపాటి మునితో కలిసి బత్తుల రమణ, పి.పద్మ, పార్వతి, రాజేంద్ర, శివ, షేక్ సలాం, పాకళ్లమని, పాకల వెంకట్, తుల సత్యనారాయణ, ఉప్పలపాటి కుమారి సహా 400 మంది వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నసీర్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, టీడీపీ నేత భరత్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి నసీర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ గెలుపునకు సైన్యంలా పని చేయాలని, పని చేసిన వారికి పార్టీలో ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి ఇంటికి పంపనున్నారని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాబోతోందని తెలిపారు.



పార్టీలో చేరిన వారితో నసీర్ తదితరులు

పోలింగ్‌కు భంగం కలిగించే శక్తులను అణచివేయండి

● బుడంపాడులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ



బుడంపాడులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, మే 8 : ప్రత్తిపాడు నియోజకవర్గంలోని సౌత్ సబ్ డివిజన్ నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామం బుడంపాడులోని పోలింగ్ కేంద్రం ప్రభుత్వ పాఠశాలను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆకస్మికంగా సందర్శించారు. బుడంపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పర్యటించి అక్కడ ఎలక్షన్స్ సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలను, బందోబస్తుకు సంబంధించి ట్రైనీ ఐపీఎస్ అధికారి, నల్లపాడు సీఐతో పాటు కలిసి పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ తుషార్ డూడి పరిశీలించారు. స్కూల్ చుట్టు ప్రక్కల నివాసం ఉంటున్న ప్రజలతో మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసు వారికి సహకరించాలని కోరారు. ప్రత్తిపాడు నియోజకవర్గ సమస్యాత్మక పోలింగ్ కేంద్రంను సందర్శించి, చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర విధి విధానాలపై క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేసారు. పోలింగు రోజున పోలింగు కేంద్రాలకు 100 మీటర్ల పరిధి లో ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్పా ఇంకెవ్వరూ ఉండకుండా చూడాలని అధికారులను కోరారు. అంతేకాకుండా వేసవి కాలం కనుక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు, మౌలిక సదుపాయాల గురించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల సమయంలో ఈ పోలిక కేంద్రంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఎలక్షన్ రోజు ముందస్తుగా పోలీసు వారు తీసుకునే చర్యలకు సంబంధించి అధికారులకు పలు సూచనలు సూచించారు. అదే విధంగా ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, (లేదా) టోల్ ఫ్రీ నంబర్ 112 లకు లేదా దగ్గరలోని సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు అని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, నల్లపాడు సీఐ నరేష్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు తొమ్మిది మంది ట్రైనీ ఎస్పీలు

● నిబంధనలు వివరించిన ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, మే 8 : జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ వివిధ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది మంది ట్రైనీ ఐపీఎస్‌లను నియమించింది. ఈ మేరకు ఆయా అధికారులతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఎన్నికలకు సంబంధించి పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఇతర డ్యూటీల విషయంలో పాటించవలసిన ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ గురించి ట్రైనీ ఐపీఎస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్ గురించి తెలుసుకొని, ఎలక్షన్ కమిషన్ నియమావళి, ఎలక్షన్ కమిషన్ వారి ఎలక్షన్ గైడ్లైన్స్ ప్రకారం నడుచుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు కార్యాలయంలో వున్న కాన్ఫరెన్స్ హాలులో విధివిధానాలు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నైసర్గిక, భౌగోళిక విస్తీర్ణం, సరిహద్దులు అసెంబ్లీ/పార్లమెంట్ నియోజకవర్గా లు, మండలాలు, పోలింగ్ లొకేషన్లు, పోలింగ్‌స్టేషన్‌లు, చెక్ పోస్టుల వివరాలు, పోలీసు అధికారులు తీసుకుంటు న్న చర్యలు, విధులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేష న్ ద్వారా జిల్లా ఎస్పీ తెలిపారు. అదేవిధంగా గుంటూ రు జిల్లాలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లల గురించి క్షుణ్ణంగా చర్చించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమావేశంలో ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నిచకేట్ సెల్కి ఐపిఎస్, ట్రైనీ ఐఏఎస్ మనోజ్ హెగ్డే, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారంలోకి రావడానికి కులాన్ని వాడుకున్నారు

● ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి సతీష్‌శర్మ

● రామాంజనేయులు సమక్షంలో టీడీపీలోకి

గుంటూరు, మే 8: గత ఎన్నికల్లో అధికారంలోకి రావటానికి సీఎం జగన్ కులాన్ని వాడుకున్నారని, అధికారంలోకి వచ్చాక అవమానించారని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ విమర్శించారు. వైసీపీ బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడిగా వ్యవహరించిన సతీష్‌శర్మ ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీడీపీ యువనేత నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే అభ్యర్థి రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేశారు. ఈ సందర్భంగా ఆయన సతీశ్ శర్మకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సతీష్‌శర్మ మాట్లాడుతూ పార్టీలో అవమానాలు భరించలేకే పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు. సతీష్‌శర్మతో పాటు పలువురు అనుచరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ, పాటిబండ్ల విజయ్ తదితరులున్నారు.



సతీష్‌శర్మకి టీడీపీ కండువా వేస్తున్న రామాంజనేయులు, పక్కన రావి వెంకటరమణ తదితరులు

సీఎం జగన్‌రెడ్డికి సగర కులం ఉందనేది తెలియదట

● ఆయన ఎలా సీఎం అయ్యారో తెలియటం లేదు: తాడిశెట్టి మురళి

తాడికొండ మే 8: ప్రజాసేవ చేయటానికి రాజకీయాల్లోకి వచ్చే ప్రతి వ్యక్తికి రాష్ట్ర, దేశ భౌగోళిక పరిస్థితులు, కులాలు, మతాలు సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు అన్నీ సమగ్రంగా తెలిసి ఉండాలి కానీ సీఎం జగన్‌రెడ్డికి సగర కులం అనేది ఉందని తెలియదన్నాడని టీడీపీ నాయకులు తాడిశెట్టి మురళి ఎద్దేవా చేశారు. బుధవారం తాడికొండ బీసీకాలనీలో సగరుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నీ కులం ఏమిటి? అసలు మీరేం చేస్తుంటారని స్వయంగా నన్ను సీఎం జగన్‌రెడ్డి అడుగుతాడని వైసీపీలో ఇమడలేక టీడీపీలోకి చేరానని తెలిపారు.

చంద్రబాబుతోనే నూరుబాషాల అభ్యున్నతి

● టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాల్ వజీర్

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : నూరుబాషాల అభివృద్ధి చంద్రబాబుతోనేనని టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముస్లిం మైనార్టీలకు అన్ని సంక్షేమ పథకాలు ఇస్తూనే అదనంగా నూరుబాషా కార్పొరేషన్ ద్వారా 100 కోట్ల బడ్జెట్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టడం హర్షణీయమన్నారు. దుల్హన్ పథకానికి ఎటువంటి నియమాలు లేకుండా ముస్లిం నూరుబాషాలకు ఇస్తామని, నూరుబాషాలలో బాగా చదువుకునే వారికి విదేశీ విద్యకు రూ.15 లక్షలు ఇస్తామని హామీ ఇవ్వడం సంతోషదాయకమన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.1500 ఇవ్వడం కుటుంబాలపై భారాన్ని తగ్గిస్తుందన్నారు. రాష్ట్ర నూరుబాషా అధ్యక్షుడు పీర్ మహ్మద్(బుజ్జి) మాట్లాడుతూ చంద్రన్న మైనార్టీ మేనిఫెస్టోను చూసి ఆకర్షితుడై ముస్లిం నూరుబాషాల కొరకు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చానని తెలిపారు. తన జాతికి వైసీపీలో అన్యాయం జరిగింది కావున టీడీపీలోకి వచ్చామని చెప్పారు. వైసీపీలోని నూరుబాషాలందరూ టీడీపీలోకి రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆదం షఫీ నాగూర్, కార్పొరేటర్ మీరావలి, షాహీద్‌బాబు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మైనార్టీ నేతలు

పెన్షనర్లకు ఆరోగ్య కార్డులపై వైద్యం అందించాలి

● రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య

గుంటూరు, మే 8 : పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య కార్డులపై వైద్యం చేయటానికి ఆసుపత్రుల యాజమాన్యాలు నిరాకరిస్తుండటంతో ప్రమాదమని తెలిసినా సొంత వైద్యానికి అలవాటుపడుతున్నారని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆరోగ్య శాఖ కార్యదర్శికి రాసిన ఒక లేఖలో తెలిపారు. సొంత వైద్యం ఆరోగ్యానికి చేటు చేస్తుందని 52 శాతం పైగా భారతీయులు వైద్యుల ప్రమేయం లేకుండా తమంతట తామే మందులు వేసుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సర్వేలో తేలిందన్నారు. సొంత వైద్యం ద్వారా తరచూ ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారని, అనవసరంగా యాంటి బయోటిక్‌ను వాడుతున్నారని ఆ నివేదిక వెల్లడించిందన్నారు. ఇది చాలా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు. జిల్లాలో మూడు వేల వరకు ఔషధ దుకాణాలున్నాయని, నెలకు రూ.3 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందన్నారు. ఇందులో 30 శాతం పైగా సొంత వైద్యం ద్వారా ఔషధాలు అమ్ముడవుతున్నట్లు అంచనా అని పేర్కొన్నారు. రోగులు జ్వరం, జలుబు చేసినా యాంటిబయోటిక్స్‌ను వాడుతున్నారన్నారు. ప్రాథమిక చికిత్స చేయాల్సిన కొందరు గుర్తింపు లేని వైద్యులు ఖరీదైన యాంటిబయోటిక్స్‌ను రాస్తున్నారన్నారు. వాటివల్ల వచ్చే దుష్ప్రభావాలను తెలుసుకోవాలన్నారు. మన దగ్గర జనాభా ఎక్కువగా ఉండటం, కాలుష్యం, పేదరికం, అపరిశుభ్రత వాతావరణ పరిస్థితుల్లో ఇన్‌ఫెక్షన్ వ్యాపిస్తుందన్నారు. దీన్ని తగ్గించాలంటే తప్పకుండా యాంటిబయోటిక్స్‌ను వాడాల్సిందేనన్నారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి చర్యలు తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య కార్డులపై ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్యం అందించే విధంగా చూసి పెన్షనర్లు సొంత వైద్యం చేసుకోకుండా కాపాడాలని వీరయ్య కోరారు.

అవినీతి, విధ్వంస పాలనకు చరమగీతం పాడాలి

● తాడిశెట్టి సమక్షంలో భారీగా టీడీపీలోకి వైసీపీ శ్రేణులు

గుంటూరు, మే 8: వైసీపీ అవినీతి, అరాచక, విధ్వంస పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, ప్రత్తిపాడు ఎన్నికల కోఆర్డినేటర్ తాడిశెట్టి మురళీమోహన్ పిలుపునిచ్చారు. పట్టాభిపురం లోని తాడిశెట్టి కార్యాలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గం లోని కుర్నూతల గ్రామం నుంచి ముద్రబోయిన వెంకట రావు తన అనుచరగణం, కాకుమాను మండలంలోని ఒల్లూరు గ్రామం నుంచి పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు, మాజీ సర్పంచ్ మదన వీరారెడ్డి ఆధ్వర్యంలో రాయపాటి శ్రీనివాసనగర్‌లోని వైసీపీకి చెందిన 25 కుటుంబాలు దార్ల శిరీష ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారందరికి తాడిశెట్టి మురళీ పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం తాడిశెట్టి మాట్లాడుతూ రాజధానుల పేరుతో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కీలకమైన వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఖగ్గ శ్రీనివాసరావు, వెల్పుల శివయ్య, తాడిశెట్టి శ్రీనివాస్, సాంబశివరావు, లక్ష్మీనారాయణ, గోపి తదితరులున్నారు.



తాడిశెట్టి మురళీ సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

పశ్చిమ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ వద్ద రగడ

● ఓ మహిళా ఉద్యోగి ఓటు వేయడంపై వైసీపీ ఏజెంట్ అభ్యంతరం

● ఫెసిలిటేషన్ సెంటర్ వద్దకు వచ్చి మంత్రి రజని ఆగ్రహం

గుంటూరు కార్పొరేషన్, మే 8: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తున్న ప్రభుత్వ మహిళా కళాశాల ఫెసిలిటేషన్ సెంటర్లో బుధవారం రగడ జరిగింది. ఒక మహిళా ఉద్యోగి ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాగా ఆమె తెలుగుదేశం పార్టీకి ఓటేసినట్లు గమనించిన వైసీపీ ఏజెంటు ఆమెను ఓటు వేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి రజని హుటాహుటిన అక్కడికి వచ్చి పోలింగ్ నిర్వహిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో వున్న సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకుంటున్న ఫెసిలిటేషన్ సెంటర్లలో ఏర్పాట్లు, హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయలేదు. ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వుండగా, అందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో పశ్చిమ ఆర్వో రాజ్యలక్ష్మి పూర్తిగా విఫలమయ్యారని ఓటర్లు ఆరోపిస్తున్నారు. దీంతో అదనపు హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించడం, హౌసింగ్ శాఖ నుంచి పర్యవేక్షకుడిగా గృహనిర్మాణ శాఖ అధికారిని నియమించారు. అయితే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఉద్యోగుల సెల్‌ఫోన్లు లోపలికి అనుమతించారు. పోలింగ్ ఏజెంట్లు కూడా సెల్ ఫోన్లు లోపలికి తీసుకెళ్లడంతో ఓటు వేసే వారిని తరచుగా ఫొటోలు, వీడియోలు తీయడం, వారు ఏ పార్టీకి ఓటు వేస్తున్నారో ఏజెంట్లు గమనించడం జరిగిందని తెలుస్తోంది. ఈ క్రమంలో ఒక మహిళా ఉద్యోగి తెలుగుదేశానికి ఓటు వేసి, బ్యాలెట్ పేపర్‌ను ఎలా మడవాలో తెలియక, సహాయం కోసం ఏర్పాటు చేసిన సిబ్బందిని అడగ్గా, అతడు పేపర్ మడతపెట్టే క్రమంలో తెలుగుదేశానికి ఆమె ఓటేసినట్లు గ్రహించి, ఆ విషయాన్ని బయటికి వెల్లడి చేశాడు. పక్కనే వున్న వైసీపీ ఏజెంట్ ఈ విషయంపై మంత్రి రజనీకి సమాచారం అందించాడు. ఆమె హుటాహుటిన అక్కడికి చేరుకుని పోలింగ్ సిబ్బందిపై విరుచుకుపడినట్లు తెలుస్తోంది.

ప్రతి నియోజకవర్గంలో 60 పోస్టల్ బ్యాలెట్లు

● పశ్చిమ నియోజకవర్గం ఏఆర్వో నిరంజన్

గుంటూరు(కార్పొరేషన్), మే 8 : ప్రతి నియోజకవర్గంలో 60 పోస్టల్ బ్యాలెట్లను ఏర్పాటు చేయనున్నట్లు పశ్చిమ నియోజకవర్గ ఏఆర్వో నిరంజన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు వారు ఉన్న నియోజకవర్గాల్లో ఓటు హక్కుకు వినియోగించుకోవాలని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.


చిరువ్యాపారులకు తోపుడుబండ్లను పంపిణీ చేస్తున్న లోకేశ్ (ఫైల్)

ఓడిన చోటే.. నిలిచి

- 29 రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు
- నాడు ఓడినా.. నేడు ప్రజల మదిని గెలిచాడు
- అయిదేళ్లుగా లోకేశ్ నిరంతర ప్రజాసేవ
- మన మంగళగిరిలో మన లోకేశే! అంటున్న నియోజకవర్గ ప్రజలు

మంగళగిరి, మే 8: ఓడిపోతే.. ఇక్కడ నాకెందుకులే పనంటూ ఎవరైనా పక్కకు తప్పుకుని పోతారు. కానీ నారా లోకేశ్ అలాకాదు...2019 ఎన్నికల్లో జరిగిన ఓటమికి కుంగిపోకుండా మంగళగిరి ప్రజల హృదయాలను ముందర గెలుచుకుంటానంటూ గత అయిదేళ్లపాటు నియోజకవర్గ ప్రజలకు వివిధ రూపాల్లో సేవలనందిస్తూ వచ్చారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతకుముందెన్నడూ.. ఏ రాజకీయనాయకుడు ఈ తరహా ప్రజాసేవ చేసి వుండరంటే అతిశయోక్తి కాదేమో! అందుకే!! లోకేశ్ నేడు ధీమాగా చెబుతున్నారు... తాను మంగళగిరిలో 53వేల పైచిలుకు మెజారిటీతో గెలుస్తానని. ఇది తాను చేసిన ప్రజాసేవ పట్ల తనకున్న నమ్మకం. ఆ నమ్మకంతోనే లోకేశ్ మంగళగిరిలో తన సత్తాను చాటబోతున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ అయిదేళ్లుగా చేస్తూ వచ్చిన సేవలేమిటో క్లుప్తంగా చూద్దాం!

పెళ్లికానుకల పంపిణీ:

లోకేశ్ సేవలు నియోజకవర్గంలో పెళ్లికానుకలతో ఆరంభమయ్యాయి. నియోజకవర్గంలో తనకు పెళ్లి కార్డు పంపించిన ప్రతి వివాహానికి స్థానిక నాయకుల ద్వారా నూతన వస్త్రాలను కానుకలుగా అందిస్తున్నారు. 2021 ఆగస్టు నుంచి ఆరంభించి ఇప్పటివరకు 2201 మందికి ఈ కానుకలను పంపిణీ చేయించారు. దళిత కుటుంబాల్లో జరిగే వివాహాలకు బంగారు మంగళసూత్రాలను అందించే కార్యక్రమాన్ని 2023 జనవరి నుంచి చేపట్టి ఇప్పటివరకు 124 మందికి వీటిని అందజేశారు.

నాలుగు చోట్ల అన్నాక్యాంటీన్‌ల నిర్వహణ

నియోజకవర్గంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో అన్నాక్యాంటీన్‌లను చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. మంగళగిరి టౌన్‌లో 2022 జూన్ పదిన వివాదాల నడుమ రాష్ట్రంలోనే తొలి అన్నక్యాంటీన్‌ను లోకేశ్ ఆరంభించారు. రోజుకు 400మందికి ఉచితంగా అన్నదానం చేస్తూ ఇప్పటికి 700వ రోజు మైలురాయి దిశగా పరుగులు తీయిస్తున్నారు. తాడేపల్లి నులకపేట, దుగ్గిరాల రైలుపేట, రేవేంద్రపాడు ప్రాంతాల్లో కూడ అన్నాక్యాంటీన్‌లను విజయవంతంగా నిర్వహింపజేస్తున్నారు.

చిరువ్యాపారులకు తోడుగా

నియోజకవర్గంలోని చిరువ్యాపారులకు లోకేశ్ చాల వెన్నుదన్నుగా నిలిచారు. నియోజకవర్గ వ్యాపితంగా చిరువ్యాపారుల ఉపాధికోసం తోపుడుబండ్లు, ఇస్త్రీ బండ్లు, మొబైల్ కిరాణా దుకాణాలు, బల్ల రిక్షాలు, ట్రైసైకిళ్లు, ఐస్‌క్రీమ్ బండ్లను పంపిణీ చేశారు. ఇప్పటివరకు సుమారు 2500మందికి తోపుడు బండ్లు, మరో 185 మందికి సెలూన్ చైర్లు పంపిణీ చేశారు. వెల్డింగ్ పనులు చేసి జీవించే కార్మికుల స్వయం ఉపాధి కోసం ఇప్పటివరకు 134 మందికి వెల్డింగ్ మెషిన్‌లను అందజేయించారు.

సంజీవని ఆరోగ్యసేవ

లోకేశ్ చేపట్టిన సేవా కార్యక్రమాల్లో ఇది ఉత్తమంగా నిలిచింది. ఉచిత డాక్టర్ కన్సల్టేషన్, ఉచిత వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ చేయించడం దీని ముఖ్యోద్దేశ్యం. ఇందుకోసం మంగళగిరి టిప్పర్ల బజారులో 2022 ఆగస్టులో, తాడేపల్లి మెయిన్‌రోడ్డులో 2022 అక్టోబరులో సంజీవని ఉచిత ఆరోగ్యకేంద్రాలను ఏర్పాటుచేయించి మంగళగిరిలో ఇప్పటివరకు 50వేల మందికి, తాడేపల్లిలో 39,378 మందికి ఉచిత వైద్యసేవలను అందించి మందులను పంపిణీ చేయించారు. ఇవిగాక మొబైల్ వైద్య సేవల కోసం ఓ ప్రత్యేక బస్సును సంజీవని ఆరోగ్యరథం పేరిట ఏర్పాటుచేయించి ఇప్పటివరకు సుమారు 40వేల మందికి వైద్యసాయమందించారు. నియోజకవర్గంలో ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 25వేల మందికి ఉచితంగా ఖరీదైన వైద్యపరీక్షలను జరిపించారు. రెండు మూడు మాసాల కిందట కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను కూడ బసవతారకం కేన్సర్ ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా జరిపించారు.

స్త్రీశక్తి

దీనిద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ, ఉచితంగా బ్యూటీషన్ శిక్షణ ఇప్పించి వారికి స్వయం ఉపాధిని చూపించే విధంగా దీనిని నిర్వహిస్తున్నారు. 2022 జూన్‌లో మంగళగిరిలోను, 2023 ఫిబ్రవరిలో తాడేపల్లిలోను, అదే ఏడాది ఏప్రిల్‌లో దుగ్గిరాలలోను ఈ స్త్రీశక్తి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ మూడు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 55 బ్యాచ్‌లను నిర్వహించి మొత్తం 2600మంది మహిళలకు కుట్టుశిక్షణను ఉచితంగా ఇప్పించడంతోపాటు వారందరికీ ఉచితంగా కుట్టుమిషన్‌లను పంపిణీ చేయించారు. ఇక మంగళగిరిలో బ్యూటీషన్ ప్రోగ్రాం కింద 124 మందికి శిక్షణను ఇప్పించి వారికి స్వయం ఉపాధిని కల్పించారు.


దుగ్గిరాలలో ఉచిత సంజీవని ఆరోగ్యరథాన్ని ప్రారంభిస్తున్న లోకేశ్(ఫైల్)


నూతన వధూవరులకు పెళ్లికానుకలను అందజేస్తున్న లోకేశ్


(ఫైల్)
మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లు, సర్టిఫికెట్లను అందజేస్తున్న లోకేశ్


నందివెలుగు రోడ్డులో నిలిచిపోయిన ఆర్ఓబీని పరిశీలిస్తున్న డాక్టర్ పెమ్మసాని, నసీర్ అహ్మద్ తదితరులు

ట్రాఫిక్ కష్టాలకు.. చెక్

- గుంటూరులో ఐదు రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం
- వైసీపీ సర్కార్ కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా దారి మళ్ళించింది
- టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నసీర్


శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జిని పరిశీలించేందుకు వెళుతున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), మే8: గుంటూరు నగరంలో నిత్యం ప్రజలు ట్రాఫిక్ కష్టాలు ఇబ్బందులు పడుతున్నారు... పెండింగ్‌లో ఉన్న 5 రైల్వే బ్రిడ్జిలను నిర్మించి గుంటూరు నగర ప్రజలకు శాశ్వతంగా ట్రాఫిక్ కష్టాలను నిర్మూలిస్తామని గుంటూరు టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం గుంటూరు నగరంలోని శ్యామలనగర్, శంకర్ విలాస్, నందివెలుగు రోడ్డులో ఉన్న రైల్వే బ్రిడ్జిలను ఆయన పరిశీలించారు. తొలుత శ్యామల నగర్ రైల్వే గేటు వద్ద నిర్మించాల్సిన రైల్వే అండర్ బ్రిడ్జి ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడితే అనేక కాలనీలకు మేలు జరుగుతుందని, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటాయని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శ్యామలానగర్ రైల్వేఅండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తుందని స్పష్టం చేశారు. శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి బ్రిటిష్ వారి కాలంలో జరిగిందని, ఇప్పటికే ఈ రైల్వే బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంటుందని, దీన్ని నాలుగు మార్గాల్లో రైల్వే అండర్, ఓవర్ బ్రిడ్జిలుగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం గతంలో సీఎం జగన్ రూ.150 కోట్లు ప్రకటించారని, ఆయన ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. అనంతరం తూర్పు టీడీపీ అభ్యర్థి నసీర్ అహ్మద్‌తో కలిసి నందివెలుగు రోడ్డులో అసంపూర్తిగా ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణపనులను ఆయన పరిశీలించారు. స్థానికంగా ఉన్న ప్రజలతో మాట్లాడారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల అనేక గ్రామాలకు రాకపోకలు చాలా సులువు అవుతాయని, తెలుగుదేశం ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తామని పెమ్మసాని స్థానికులకు హామీ ఇచ్చారు. గుంటూరు నగరంలో ప్రధానంగా 5 రైల్వే బ్రిడ్జిలను ఎంపిక చేసుకున్నామని, అందులో గడ్డిపాడు రైల్వే మెగా ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతామన్నారు. అదేవిధంగా నెహ్రూనగర్, సంజీవయ్య నగర్ రైల్వే బ్రిడ్జిలను కూడా సాధ్యమైనంత త్వరలో పరిశీలించి వాటిపై కూడా సమగ్ర నివేదికలను సిద్ధం చేస్తామన్నారు. పూర్తి డీపీఆర్‌లతో నిధులు మంజూరు చేయించి గుంటూరు నగరంలో రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనులను తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. సీఎం జగన్, వైసీపీ సర్కారుక్కు ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్టదని, కేవలం దోచుకోవటం, దాచుకోవటం మాత్రమే తెలుసని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజల, నగర టీడీపీ అధ్యక్షులు డేగల ప్రభాకర్, టీడీపీ నాయకులు షేక్ షౌకత్, రావిపాటి సాయి కృష్ణ, నల్లమోతు రవి చౌదరి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.

వ్యూహాల్లో.. ముందంజ

- పొన్నూరు ప్రచార పర్వంలో ధూళిపాళ్ల
- అంబటికి దూరమైన సొంత సామాజికవర్గం

పొన్నూరుటౌన్, మే8: పొన్నూరు శాసనసభ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా 7వ సారి బరిలో దిగిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రచారంతోపాటు వ్యూహాల్లోనూ ముందంజలో ఉంటున్నారు. అందులో భాగంగా గ్రామాలకు గ్రామాలే వైసీపీని వీడి టీడీపీ పంచన చేరుతున్నాయి. కీలక వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరటం ప్రత్యర్థి పార్టీకి మింగుడు పడటం లేదు. దీనికి తోడు ధూళిపాళ్ళ కుటుంబం పోటీ చేసిన పది పర్యాయాలు కొత్త ప్రత్యర్థులతోనే తలపడుతూ వచ్చారు. అదే ఆనవాయితీ ప్రకారం ఈ సారి కూడా గత 50 ఏళ్లగా పొన్నూరు ముఖం అంటేనే తెలియని అంబటి మురళీకృష్ణ పొన్నూరు గడ్డపై అడుగుపెట్టి వైసీపీ తరపున పోటీలో దిగారు. ప్రత్యర్థి ప్రతికూలతలను తన అనుకూలంగా మార్చుకుంటున్న నరేంద్ర కుమార్ టీడీపీని మరింత బలోపేతం చేసేవిధంగా కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో నరేంద్ర ఓటమి చెందినప్పటికి పొన్నూరు మండలంలో మెజార్టీ లభించింది. ఈ మెజార్టీని మరింత పెంచుకునే విధంగా వ్యూహ రచనలు చేస్తున్నారు. గత ఎన్నికలో ప్రత్యర్థికి అత్యధికంగా మెజార్టీ వచ్చిన పెదకాకాని మండలంలోని నంబూరు, వెనిగండ్ల వంటి గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆ గ్రామాలో వైసీపీ ఆధిపత్యాని తగ్గించే విధంగా పోరాడుతున్నారు.

తనకే ప్రతికూలంగా అంబటి వ్యాఖ్యలు..

వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సామాజిక, కులాల వాఖ్యలు బూమరాంగ్‌లా మారి అంబటి మురళికి ఎన్నికల క్షేత్రంలో ప్రతికూలంగా మారాయి. పొన్నూరులో తన సామాజికవర్గం ఓట్లు 40 వేలు ఉన్నాయని ధూళిపాళ్ళ సామాజికవర్గం ఓట్లు కేవలం 20 వేలే ఉన్నాయని తాను ఫుల్ టికెట్‌నని ధూళిపాళ్ళ హాఫ్ టికెట్ అని పలు బహిరంగ వేదికలపై మురళీకృష్ణ బాహాటంగా మాట్లాడారు. ఇవే వాఖ్యలు అయినకు ప్రతికూలతను తెచ్చిపెట్టాయి. అంబటి వాఖ్యలు ఇతర సామాజిక వర్గాలో తమపై వ్యతిరేకతను పెంచే విధంగా ఉన్నాయని సొంత సామాజికవర్గం అంతర్మధనం చెందుతుంది. అంతే కాకుండా వెల్లలూరు, మంచాల వంటి గ్రామాల్లో క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు కుటుంబానికి మంచి పేరు ఉంది. కానీ మురళీకృష్ణ ఎన్నికల ప్రచారంలో అంబటి రాయుడు కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు వెల్లలూరు, మంచాల గ్రామాల్లో ప్రజలో తీవ్ర ఆగ్రహ ఆవేశాలను నింపింది. 50 ఏళ్లుగా పొన్నూరు గడ్డపై అడుగు మోపని అంబటి మురళీ రాజకీయ కారణాలతో రాయుడు కుటుంబాని విమర్శించటం సొంత సామాజికవర్గ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలాంటి ప్రతికూలతల నేపథ్యంలో అంబటి మురళీ ఎన్నికల క్షేత్రంలో వెనుకంజలో ఉండగా గత ఎన్నికలో జరిగిన లోపాలను సరిచేసుకుంటూ కార్యకర్తలను నాయకులను ఏకతాటిపై నడిపించుకోవటమే కాకుండా జనసేన బీజేపీ కార్యకర్తలను, శ్రేణులను మమేకం చేసుకుంటూ నరేంద్ర కుమార్ ఎన్నికల క్షేత్రంలో ముందంజలో ఉన్నారని రాజకీయ పరిశీలకులు అంచనాలు వేస్తున్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు


ప్రచారం నిర్వహిస్తున్న ధూళిపాళ్ల జ్యోతిర్మయి


ప్రచారం నిర్వహిస్తున్న నరేంద్ర కుమార్తె

శాంతియుత తెనాలికి.. నాది గ్యారెంటీ

- అరాచకాలు లేని శాంతియుత తెనాలిని చూస్తారు...
- అధికారంలోకి వచ్చిన వారంలో గంజాయి విక్రయాలు లేకుండా చేస్తా
- వ్యాపారులూ మీపై దాడులుండవ్... మీ ఆస్తుల ఆక్రమణలుండవ్
- తెనాలిలో మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తాం
- నేనే అభివృద్ధి చేశా... ఇకపై నేనే పూర్తిచేస్తా
- నాదెండ్ల మనోహర్



తెనాలి, మే 8(ఆంధ్రజ్యోతి): తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన నేత నాదెండ్ల మనోహర్. రాష్ట్రంలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న నియోజకవర్గాల్లో తెనాలికూడా ఒకటి. జనసేన పార్టీలో పవన్ తర్వాత కీలక నేతగా గుర్తింపు పొందిన మనోహర్ ఇక్కడి నుంచి పోటీచేయటం ఒక కారణమైతే, తెనాలిలో ఎవరు గెలిస్తే ఆ పార్టీదే రాష్ట్రంలో అధికార పీఠాన్ని దక్కించుకుంటుందన్న ఆనవాయితీ కూడా నిజమవుతూ వస్తుండటంతో తెనాలి ఎన్నిక కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్‌గా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి తప్ప తెనాలిలో ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి శూన్యం. పైగా ఆయన అప్పట్లో సగంపైగా చేసిన పనులకు సంబంధించి నిదులను మురగబెట్టిన ఘనతకూడా అధికార పార్టీ నేతలకే దక్కుతుందనేది జనం చేస్తున్న విమర్శే. కొత్త అభివృద్ధి అటుంచితే, ఆయన అధికారంలో ఉన్నపుడు చేసిన పనులను కొనసాగిస్తూ వాటిని మళ్లీ ఆయనే పూర్తిచెయ్యాల్సిన పరిస్థితి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం రెండిటినీ మాటల్లో కాకుండా రేపు గెలిచాక చేతల్లో చేసి చూపిస్తానంటూ జనసేన ఎన్నికల సింబల్ అయిన గాజుగ్లాసులోనే టీ తాగుతూ ఆంధ్రజ్యోతితో పంచుకున్న అభిప్రాయాలు మనోర్ మాటల్లోనే...

ప్రశ్న: మీ గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయి?

జవాబు: ప్రజలు ఎప్పుడో ఒక నిర్ధిష్ట ఆలోచనకు వచ్చేశారు. ఈసారి కూటమి విజయ పతాకాన్ని ఎగురవేయటం గ్యారెంటీ. అదే పరిస్థితి తెనాలిలోనూ ఉంటుంది. నాకు తెనాలి ప్రజలపై పూర్తి విశ్వాసం ఉంది. వారికి అభివృద్ధి, సంక్షేమం, శాంతియుత వాతావరణం కావాలి. అందుకే నాకు అవకాశం ఇవ్వటానికి నిర్ణయించుకున్నారన్న సందేశాలు వచ్చాయి.

ప్రశ్న: మీపై ఆరోపణలను స్పందించనేలేదు!?

జవాబు: నేనేంటనేది నియోజకవర్గ ప్రజలకు తెలుసు. అంతేకానీ రాజకీయంగా ఎదుర్కొనలేని పరిస్థితుల్లో నాపై చేస్తున్న ఆరోపణలకు నేను ప్రాధాన్యం ఇవ్వను. ఎవరైనా నాపై చౌకబారు విమర్శలు చేస్తే దానిపై స్పందించటం మొదటి నుంచి నాకు ఇష్టం ఉండదు. నేను ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయను. రాజకీయంగానే ఎదుర్కొంటాను. ఇక నాపై విమర్శలు చేసేవారికి వాటిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నా.

ప్రశ్న: తెనాలిని ఎలా చూద్దామనుకుంటున్నారు?

జవాబు: ఇప్పటివరకు ఆంధ్రాప్యారిస్ అంటూ గొప్పలు చెప్పుకోవటానికి మాత్రమే పరిమితమయ్యాం. దానిని సాకారం చెయ్యటానికి ఎవరూ ముందుకు రావటంలేదు. నేను కొంతవరకు మాత్రమే చేయగలిగా. మిగిలిన అభివృద్ధిని ప్రణాళికా బద్ధంగా చేయదలిచా. తెనాలినే కాకుండా, కొల్లిపర మండలాన్ని, తెనాలి రూరల్ గ్రామాల్లోనూ నాదైన శైలిలో అభివృద్ధికి బాటలు వేస్తా. రేపు అధికారంలోకి వస్తే అప్పటినుంచి 15 ఏళ్ల నిర్ధిష్ట ప్రణాళిక రూపొందించుకున్నా.

ప్రశ్న: తెనాలి అరాచకాలకు చిరునామాగా మారిందా?

జవాబు: నిజమే. ఎన్నికల ప్రచారంలో తిరుగుతుంటే కొన్ని కుటుంబాలు వచ్చి కన్నీటి పర్యంతమయ్యాయి. తమ పిల్లల భవిష్యత్ నాశనమైపోతోందని, మీరు ఎంత తొందరగా వచ్చి ఆ వ్యసనాలను రూపుమాపితే అప్పుడే మా పిల్లలు మాకు మనుషుల్లా దక్కుతారని, లేకుంటే రానున్న రోజుల్లో ఏమైపోతారో అర్ధంకావటం లేదని ఆవేదన చెందుతున్నారు. దీనంతటికీ కారణం ప్రభుత్వంలోని పెద్దలే.

ప్రశ్న: గంజాయి అమ్మకాలు అరికట్టే ఆలోచన?

జవాబు: గంజాయి అమ్మకాలను ప్రభుత్వ పెద్దలే పోత్సహించారు. యువతను గంజాయి మత్తులో దించటమే కాకుండా, వారితోనే అమ్మకాలు సాగిస్తున్నారు. ఇది చాలదన్నట్టు అత్యంత ప్రమాదకర మాదక ద్రవ్యాలను కూడా రాష్ట్రంలోకి దింపేశారు. తెనాలిలో మాత్రం నేను అధికారంలోకి వచ్చిన వారంలో పూర్తిగా గంజాయి అమ్మకాలే కాదు, జాడకూడా లేకుండా చేస్తా. ఇది కచ్చితంగా చేసి చూపుతా.

ప్రశ్న: నియోజకవర్గంలో కొన్ని వర్గాలపై దాడులు పెరిగిపోవటం!?

జవాబు: తెనాలి పట్టణం బంగారం, వెండి, ఇతర వ్యాపారాలకు నిలయం. అందరూ రాజకీయ, కులమత బేదాలు లేకుండా ఇప్పటి వరకు జీవనం సాగిస్తూ వచ్చారు. ఇంతటి ప్రశాంత పట్టణంలో ఈ ఐదేళ్లలో ప్రధానంగా ఆర్యవైశ్యులపై దాడులు పెరిగిపోయాయి. మార్వాడీ వర్గాలపైనా దాడులు పెరిగాయి. కొందరి ఆస్తులు, దుకాణాలు బలవంతంగా ఆక్రమించుకునే ప్రయత్నాలూ చేశారు. ఇది నిజంగా దుర్మార్గమే. అయితే భవిష్యత్‌లో ఆ పరిస్థితి రానివ్వను.

ప్రశ్న: తెనాలి అభివృద్ధికి ప్రణాళిక ఎట్లా ఉండబోతోంది?

జవాబు: నేను అధికారంలో ఉన్న పదేళ్లలో తెనాలి, కొల్లిపర మండలాల్లో రూ.1000 కోట్ల వరకు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయగలిగా. తెనాలి పట్టణానికి ప్రకాశం బ్యారేజి నుంచి భారీ పైప్‌లైన్ వేయించి తాగునీటిని పట్టణానికి తీసుకొచ్చా. రూ.100 కోట్ల ఈ పథకం నాద్వారానే జరిగిందని గర్వంగా చెబుతా. అటు కొల్లిపర మండలంలోనూ కృష్ణానదిలో బోర్లు వేసి, అక్కడి నుంచి గ్రామాలకు తాగునీటి సరఫరాను భారీ నిధులతో పూర్తిచేశా. తెనాలి-నందివెలుగు నాలుగు లైన్ల రహదారి తెనాలి వరకే వచ్చి ఆగింది. ఇప్పటి వరకు పూర్తిచేయలేకపోయారు. దానినీ నేనే పూర్తిచేసి చూపిస్తా. కళాకారులకు పుట్టినిల్లయిన తెనాలిలో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రాన్ని నిర్మించింది కూడా నా కాలంలోనే. మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ నా కాలంలోనే నిర్మించాం. మున్సిపల్ మార్కెట్ వెనకాల భవనానికి రూ.15 కోట్లు ఇస్తానన్న ముఖ్యమంత్రి రూపాయికూడా ఇవ్వలేదు. అదికూడా నేనే నిర్మించి చూపిస్తా.

ప్రశ్న: తెనాలిలో జిల్లా వైద్యశాల ప్రక్షాళన ఏమైనా?

జవాబు: తెనాలిలోనే అన్ని వైద్య సేవలు పొందేలా మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చెయ్యాలనే ఆలోచన ఉంది. దీనిని కూడా పూర్తిచేసి తీరుతా. తల్లీ పిల్లల వైద్యశాలను మరింత మెరుగుపరిచి, పసివారికి కానీ, బాలింతలకు కానీ ప్రాణాపాయం లేకుండా క్షేమంగా ప్రసవం చేయించుకుని ఇంటికి వెళ్లేలా మార్పులు చేస్తా.

ప్రశ్న: కొల్లిపర మండలంలో ఇసుక తవ్వనివ్వమని గతంలో రైతులకు మాటిచ్చారంటారు?

జవాబు: అవును. గతంలో ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటి లంక గ్రామాల రైతులు పంటలకు నీరులేక, బోర్లు పనిచేయక అవస్థలు పడ్డారు. విలువైన వాణిజ్య పంటలకు కోల్పోయారు. అప్పట్లో కొల్లిపర మండలంలోని రైతులు నా దగ్గరకు వచ్చి వారి సమస్యను వివరించారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకోసమని నా నియోజకవర్గ పరిధిలో ఇసుక తవ్వకాలు జరగవని మాటిచ్చా. ఆ మాట ప్రకారం నేను అధికారంలో ఉన్నంత కాలం ఎన్ని వత్తిడులు వచ్చినా ఇసుక తవ్వటానికి అవకాశం ఇవ్వలేదు.

ప్రశ్న: ఆ మండలంలో మీకు ఓట్లు లాభిస్తాయనే నమ్మకం ఉందా?

జవాబు: ఉంది.. పదేళ్లయినా రైతులు ఇంకా మర్చిపోలేదు. నేను ప్రచారానికి వెళ్లినప్పుడు వారే స్వయంగా గుర్తుచేశారు. ఇప్పుడు జరుగుతున్న విచ్చలవిడి తవ్వకాలతో ఒకరిద్దరు రూ.కోట్లకు పడగలెత్తితే, రైతులమైన మేమంతా పంటలు నష్టపోయామని చెబుతున్నారు. మేము ఓటేసిన నేతల దగ్గర మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని, మాటిచ్చి దానిపై నిలబడే మీవంటి వారే కావాలంటూ వైసీపీ అభిమానులు కూడా స్వాగతించారు. గతంలో నేను గెలవనని తెలిసినా 30వేల ఓట్లు వేశారు. వాటిలో ఎక్కువ శాతం కొల్లిపర మండలం నుంచే ఓట్లు వాచ్చాయి. వారుకూడా నాకులాగానే రాజకీయం కాకుండా విధ్వంసాన్ని అరికట్టాలని చూస్తున్నారు. తప్పకుండా ఆదరిస్తారని నమ్మకం నాకుంది.

ప్రశ్న: తెనాలి పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఉందనుకుంటున్నారా?

జవాబు: తెనాలి పట్టణంలో రోడ్ల వెడల్పు తక్కువ. అందువల్ల ఈ సమస్య ఉంది. దీనికి ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణం జరగితే చాలావరకు సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మార్కెట్ నుంచి చెంచుపేట వైపునకు నడక వంతెన నిర్మించాలని గతంలోనే ప్రతిపాదించాం. అయితే అది అప్పట్లో జరగలేదు. అయితే ఇప్పుడు పెరిగిన ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని నడక వంతెనా! లేక శిధిల స్థితికి చేరిన ఓవర్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని విస్తరించటమా అనే ఆలోచన ఉంది. ట్రాఫిక్ సమస్యను నియంత్రించటానికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నా హయాంలోనే తీసుకొచ్చాం. కానీ దానిని అలంకార ప్రాయం చేశారు.

ప్రశ్న: మీరు లోకల్ కాదని అంటున్నారు??

జవాబు: నన్ను గెలిపించిన ప్రజలే నా కుటుంబం. ఆ ప్రాంతమే నా ఇల్లు. సేవ చేసే ఆలోచనే ఉండాలి కానీ, దానికి లోకల్, నాన్‌లోకల్ అనే వాదన ఎందుకు వస్తుంది? పోనీ నాన్‌లోకల్ కావటం వల్ల నేను చేయలేకపోయింది, నేను నిర్లక్ష్యం చేసిందేమిటి? స్థానికులయిన నేతలు చేసిన అభివృద్ధి ఏమిటనేది ప్రజలకు తెలియదా! నేను నా పదవీ కాలంలో చేసిన అభివృద్ధి చూపించగలను. నేనేంటనేది జనానిక తెలుసు మాటిస్తే తప్పననీ తెలుసు. సాధ్యమయితేనే హామీ ఇస్తా. ఇచ్చింది చేసిచూపిస్తా. అటువంటి విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వను. మరోసారి చెబుతున్నా... జనానికే నేను జవాబుదారీ. వారికి సమాధానం ఎప్పుడడిగినా చెబుతా. ఇటువంటి వాటికోసం సమయం వృధా చేసుకోను. రేపు గెలిచాక జనం రుణం తప్పనిసరిగా తీర్చుకుంటా. ఈ నియోజకవర్గంలో నా మార్క్ అభివృద్ధిని చూపిస్తా. ఇది పక్కా.

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

నేడు నవులూరులో విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంగళగిరి, మే 8: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా గురువారం మంగళగిరి మండలం నవులూరు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. మక్కెవారిపేట, గోలి వారి తోట, బాపనయ్య నగర్, ఈఎస్‌ఆర్ గార్డెన్స్, టిడ్కో ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

230 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 8: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 230 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,900 గరిష్ఠధర రూ.14,400, మోడల్‌ధర రూ.14,025 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,700, గరిష్ఠధర రూ.14,025, మోడల్‌ధర రూ.14,025 పలికాయి.

జగన్ హఠావో.. ఏపీ బచావో : దాసరి చెన్నకేశవులు



అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న చెన్నకేశవులు తదితరులు

మంగళగిరి, మే 8: దళితుల ఓట్లతో గద్దెనెక్కి దళితులపైనే దాడులు, హత్యలు, దౌర్జన్యాలకు పాల్పడిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ప్రబుద్ధ పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు పిలుపునిచ్చారు. మంగళగిరి తాలూకా సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బుధవారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు విలేకరులతో మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి సంబంధించిన 27 పథకాలను జగన్ రద్దు చేసి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీశారని ధ్వజమెత్తారు. జగన్ హఠావో.. ఏపీ బచావో పేరిట ఈ నెల పదో తేదీన మంగళగిరి బైపాస్ రోడ్డులో నిర్వహిస్తున్న మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని కోరారు. మాలమహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం రామారావు మాట్లాడుతూ దళితులను నమ్మించి వంచించిన జగన్‌కు సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు లాం అనిల్, గుర్రం భాగ్యరాజు, డి.అవినాష్, రవి, జేమ్స్, కూరపాటి రవి, గోపి, శంకర్, జలరావు, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులంతా ఎన్డీఏ కూటమి వైపే

● సుందరరావు యాదవ్



యాదవుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సుందరరావుయాదవ్

తాడేపల్లి టౌన్, మే 8: యాదవులంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైపే ఉన్నారని యాదవ సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం సాయంత్రం తాడేపల్లి పోలకంపాడులో యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందరరావుయాదవ్ మాట్లాడుతూ దేశంలో యాదవులకు ప్రత్యేక స్థానం ఉందని, తెలుగుదేశం పార్టీ హయాంలో యాదవులకు టీటీడీ చైర్మన్ పదవి ఇచ్చారని గుర్తు చేశారు. బీసీలకు తెలుగుదేశం హయాంలోనే మేలు జరిగిందని కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు 50 ఏళ్లకే పింఛ ను ఇస్తారని వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం యాదవ సామాజిక వర్గం కృషి చేయాలన్నారు. కార్యక్రమం లో బీసీ పట్టణ అధ్యక్షుడు చల్లా శ్రీను, తాడిబోయిన భాస్కర్, తోట సాంబయ్య, వంగా నరేంద్ర, వంగా దేవదాస్, వంగా సత్యనారాయణ, వంగా రాజేష్, వెల్లంకి రంగారావు, నక్కా రాజేష్, వెంకటేశ్వరరావు, అనంత ప్రభాకర్, మురళి, పెద్దిరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్టీలకు అండగా టీడీపీ : మాజీ ఎంపీపీ రాంగోపాల్



ఎస్టీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కాకుమాను, మే 8: ఎస్టీలకు ఎల్లవేళలా తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని మాజీ ఎంపీపీ, పొన్నూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మామిళ్లపల్లి రాంగోపాల్ అన్నారు. కాకుమాను ఎస్టీకాలనీలో బుధవారం తెలుగుదేశం, జనసేన నాయకులు ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రాంగోపాల్ మాట్లాడుతూ ఐదేళ్లుగా అధికార పార్టీ ఎస్టీలను అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచిందని విమర్శించారు. స్థానిక ఎస్టీ కాలనీలో సీసీ రహదారుల నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వ పాలనలోనే చేశారని తెలిపారు. వైసీపీ పాలన వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులు రామాంజనేయులు, చంద్రశేఖర్‌లకు ఓటు వేసి వారిని అఖండ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, జనసేన నాయకులు కొసన నరేంద్ర, కోంద్రు గోపి, అంకమ్మచౌదరి తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈ నెల 10, 11 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ తెలిపారు. నెంబరు. 07129 సికింద్రాబాద్ - ఖుర్దారోడ్ రైలు ఈ నెల 10వ తేదీన శుక్రవారం సాయంత్రం 6.20కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు సాయంత్రం 4.30కి ఖుర్దారోడ్ చేరుకొంటుంది. నెంబరు. 07130 ఖుర్దారోడ్ - సికింద్రాబాద్ రైలు ఈ నెల 11న రాత్రి 11.30కి బయలుదేరి 12వ తేదీ మధ్యాహ్నం 3.55కి గుంటూరు, రాత్రి 10 గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. ఈ రైళ్లు జనరల్ బోగీలతో ప్రయాణిస్తాయి. కాగా భువనేశ్వర్ - ఎల్‌టీటీ - భువనేశ్వర్ ప్రత్యేక రైళ్లకుసత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలోనూ నిలుపుదల సౌకర్యాన్ని కల్పించినట్లు జెడ్‌ఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు యు.శశిధర్‌చౌదరి తెలిపారు.

అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి



తాడికొండలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

తాడికొండ, మే 8: అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని రైతులు, మహిళలు తెలిపారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు బుధవారం నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం భూములు త్యాగం చేసిన రైతులను సీఎం జగన్మోహన్‌రెడ్డి నట్టేట ముంచారన్నారు. విశాఖలో భూములు దోచుకునేందుకు మూడు రాజధానుల ప్రకటన చేశారని విమర్శించారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

పెదనందిపాడు, మే 8: మండలపరిధిలోని కట్రపాడు, నాగులపాడు, వరగాని గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేసి, టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మే 13న కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘ మండల మాజీ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం ఖాయం

● అమరావతి రాజధానిగా స్థిరపడుతుంది

● రాజధాని గ్రామాల్లో శ్రావణ్‌కుమార్ ప్రచారం

● ఘన స్వాగతం పలికిన స్థానికులు, మహిళలు



తాళ్లాయపాలెంలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, మే 8: రాజధాని గ్రామాల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌కు జనం ఘన స్వాగతం పలికారు. తాళ్లాయపాలెం, మం దడం గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. అంబే ద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చర్చిల్లో, మసీదులో ప్రార్థనలు చేసి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని మూడేళ్లలో సీడ్ క్యాపిటల్‌లో కట్టడాలు పూర్తి చేసి అమరావతిని స్థిరంగా ఉంచుతారన్నా రు. నియోజకవర్గ అభివృద్ధికి హితోధికంగా కృషి చేస్తానన్నారు. గతంలో ఎమ్మెల్యేగా పని చేసి నిరూపించానని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అమరావతి రాజధానిని అనుసంధానించటానికి రోడ్డు వ్యవస్థ పూర్తి చేస్తానని చెప్పారు. ఐదేళ్లు నరకం చూపిన వైసీపీని ఇంటికి పంపుదామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు మహిళా అధ్యక్షురాలు ఎర్రమనేని నాగమల్లేశ్వరి, నాయకులు కొండెపాటి సతీష్ చంద్ర(బుజ్జి), శ్రీహరి, పేరం రాములు, ఐనవోలు ఇమ్మానియోలు, పి.ఆనందరావు, మట్టుపల్లి గిరీశం, గడ్డం బాబు, స్ఫూర్తి రవి, వెంగళదాసు సురేష్, వాకచర్ల వీరాంజనేయు లు, కాటా అప్పారావు, జమ్ముల అనిల్ బండ్ల పట్టయ్య, బెజవాడ రమేష్ , నూతక్కి కొండయ్య, కట్టా రాజేంద్ర, మందడం గ్రామ అధ్యక్షుడు ఆలూరి సుబ్రమణ్యం, మాజీ జడ్పీటీసీ బెజవాడ నరేంద్రబాబు, మాజీ ఎంపీటీసీ లు జొన్నలగడ్డ కిరణ్, వేజళ్ల శివప్రసాద్, మైనేని గిరిజా, బండ్లమూడి ప్రియాంక, తాడికొండ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, మండల ఉపా ధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు, జేనసేన కన్వీనర్ బేతపూడి విజయ శేఖర్, మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, మహిళా జేఏసీ నేత అం కం సువర్ణ కమల, దళిత జేఏసీ నేతలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న రాజధాని గ్రామాల మహిళలు

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం, మే 8: రాష్ట్రంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్ళలో చేసే కూటమి అభ్యర్థులకే ఓట్లు వేయాలని తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఫిరంగి పురంలోని పలు కాలనీల్లో జరిగిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ వేసవిలో కనీసం తాగునీరు కూడా ప్రజలకు ఇవ్వకుండా చేసిన ప్రభుత్వాన్ని పడగొట్టాలన్నారు. రైతులకు ఇచ్చే సబ్సిడీలు, యంత్ర సామగ్రి, కుంటల తవ్వకాలు జరపకుండా రైతులకు ఒరగబెట్టానని జగన్ చెప్పటం హాస్యాస్పదంగా ఉంద న్నారు. కనీసం రైతులకు టార్పాలిన్ పట్టలు కూడా సరిగా ఇవ్వలే దని ఆయన విమర్శించారు. సూపర్ - 6 పథకాలతో చంద్రబాబు రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో ప్రజల ఆస్తులను కాజేసే దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. దళితులు, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలపై వైసీపీ నాయకులు నిత్యం ఏదో ఒక చోట దా డులు, దౌర్జన్యాలు చేస్తూనే ఉన్నారన్నారు. ఇలాంటి అరాచక పాలకులను ఓటు ద్వారా తరిమి కొట్టాలన్నారు.

అడుగడుగునా హారతులు

ఫిరంగిపురంలో జరిగిన రోడ్ షోలో శ్రావణ్‌కుమార్‌కు మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చారు. అంతేగాక బాణసంచా పేలుస్తూ పూలు జల్లుతూ మేళ తాళాలతో ఆద్యంతం కోలాహలంగా కొనసాగింది. అంతేగాక వడ్లమాను బాబూరావు గృహం వద్ద కాపులకు చెందిన 50 కుటుంబాలు తెనాలి శ్రావణ్‌కుమార్ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండవ నరసింహారావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, మేకల నాగేశ్వరరావు, కొలగాని కొండలు, వడ్లమాను బాబూరావు, బుజ్జి, యోహాన్, లూర్దయ్య, వేల్పూల అంకారావు, బందనాథం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో పోలేరమ్మ గుడి వద్ద శ్రావణ్‌కుమార్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

సైకో పాలనకు ముగింపు పలకాలి

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు

పెదనందిపాడు, మే 8 : రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో సైకో పాలనకు ముగింపు పలకాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు పిలుపునిచ్చారు. మండలపరిధిలోని జీజీపాలెం, గోగులమూడి, అన్నపర్రు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేసి, వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కూటమికి బీసీ వర్గాల మద్దతు అనూహ్యంగా ఉందన్నారు. జీజీపాలెంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అయిదేళ్ళ వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఒక్క శాతమైనా అభివృద్ధి పనులు సాగలేదని విమర్శించారు. గత టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వంతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్ళలో అమలు చేసి పేదల్ని ధనికులుగా చేయగల సత్తా ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. మ్యానిఫెస్టోలో మహిళలకు అధికంగా లబ్ధిచేకూరుతుందని, ప్రతి రైతుకు, నిరుద్యోగ యువతకు ఆసరాగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించిన ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్లు కొర్రపాటి నాగేశ్వరరావు, పరాంకుశం శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, గ్రామ అధ్యక్షులు పాతాళపు శ్రీనివాసరాజు, కొల్లా సురేష్, నల్లూరి అంకమ్మరావు, మాజీ సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావు, ఎన్నారై టీడీపీ నాయకులు కపుల కోటేశ్వరరావు(నానీ), జనసేన మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, సీనియర్ టీడీపీ నేత కొలసాని శ్రీనివాసరావు, నాయకులు విక్రయాల సుబ్బారావు, కపుల యజ్ఞనారాయణ, లావు వీరభద్రరావు, కొల్లా వీరయ్యచౌదరి, కొలసాని వీరయ్యచౌదరి, గోపాలకృష్ణ, నూతి హనుమంతరావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన చిన్నలింగాయపాలెం గ్రామస్థులు

30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

కాకుమాను మండలం చిన్నలింగాయపాలెంకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు గోగులమూడి ప్రచారంలో ఉన్న కూటమి ఎమెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు.

అధికారంలోకి రావడానికి కులాన్ని వాడుకున్నారు

● ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి సతీష్‌శర్మ

● రామాంజనేయులు సమక్షంలో టీడీపీలోకి



సతీష్‌శర్మకి టీడీపీ కండువా వేస్తున్న రామాంజనేయులు, పక్కన రావి వెంకటరమణ తదితరులు

గుంటూరు, మే 8: గత ఎన్నికల్లో అధికారంలోకి రావటానికి సీఎం జగన్ కులాన్ని వాడుకున్నారని, అధికారంలోకి వచ్చాక అవమానించారని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ విమర్శించారు. వైసీపీ బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడిగా వ్యవహరించిన సతీష్‌శర్మ ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీడీపీ యువనేత నారా లోకేశ్‌ఆదేశాల మేరకు ఎమ్మెల్యే అభ్యర్థి రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేశారు. ఈ సందర్భంగా ఆయన సతీశ్‌శర్మకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సతీష్‌శర్మ మాట్లాడు తూ పార్టీలో అవమానాలు భరించలేకే పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు. సతీష్‌శర్మతో పాటు పలువురు అనుచరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ, పాటిబండ్ల విజయ్ తదితరులున్నారు.

పోలింగ్‌కు భంగం కలిగించే శక్తులను అణచివేయాలి

● బుడంపాడులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ



బుడంపాడులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ, ట్రైనీ ఐపీఎస్, తదితరులు

గుంటూరు, మే 8: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని సౌత్ సబ్ డివిజన్ నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామం బుడంపాడులోని పోలింగ్ కేంద్రం ప్రభుత్వ పాఠశాలను ఎస్పీ తుషార్ డూడీ ఆకస్మికంగా సందర్శించారు. బుడంపాడులోని ప్రభుత్వ పాఠశాలలో పర్యటించి అక్కడ ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలను, బందోబస్తుకు సంబంధించి ట్రైనీ ఐపీఎస్ అధికారి, నల్లపాడు సీఐతో కలిసి పోలింగ్ కేంద్రాలను ఎస్పీ తుషార్ డూడీ పరిశీలించారు. పాఠశాల చుట్టు ప్రక్కల నివాసం ఉంటున్న ప్రజలతో మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రత్తిపాడు నియోజకవర్గ సమస్యాత్మక పోలింగ్ కేంద్రంను సందర్శించి చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర విధి విధానాలపై క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలింగు రోజున పోలింగు కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్ప ఇంకెవ్వరూ ఉండకుండా చూడాలని అధికారులను కోరారు. అంతేకాకుండా వేసవి కాలం కనుక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు, మౌలిక సదుపాయాల గురించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల సమయంలో ఈ పోలింగుకేంద్రంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా పోలీసు వారు తీసుకునే చర్యలకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సీ-విజిల్ యాప్ ద్వారా, (లేదా) టోల్ ఫ్రీ నంబర్ 112లకు లేదా దగ్గరలోని సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు అని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, నల్లపాడు సీఐ నరేష్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరగాలంటే సీఎస్‌ను బదిలీ చేయాలి : పాతర్ల రమేష్

తాడేపల్లి, మే 8: రాష్ట్రంలో టీడీపీ కూటమి అభ్యర్థులపై వైసీపీ దాడులు పెరిగిపోయాయని, ఎన్నికలు సజావుగా జరగాలంటే సీఎస్ జవహర్ రెడ్డిని బదిలీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వ్యవస్థలను భ్రష్టుపట్టించి, ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే జగన్ చేస్తున్న ప్రయత్నాలకు ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట వేయడంతో జగన్ దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇదే క్రమంలో వైసీపీకి మద్దతుగా వ్యవహరిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డిని కూడా బదిలీ చేస్తే రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని, రాష్ట్రంలో మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సమస్యాత్మక ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ ఫిర్యాదులపై పోలీసులు స్పందించడం లేదని, వైసీపీ ఒక్క ఫిర్యాదు ఇచ్చినా జీ హుజూర్ అంటూ స్పందిస్తున్నారని ఇటువంటి వాటిపై కూడా డీజీపీ, ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లు వేసేందుకు వచ్చిన ఉపాధ్యాయులను కూడా వైసీపీ గూండాలు పలుచోట్ల ఇబ్బందులు పెట్టారని, గందరగోళం సృష్టించడమే ప్రభుత్వ ధ్యేయంగా కనబడుతోందని పోలీస్ ఉన్నతాధికారులు గట్టి చర్యలు తీసుకుంటే కింది స్థాయి నుంచి పలువురు సక్రమంగా పని చేస్తారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేకచోట్ల ఎన్డీఏ కూటమి అభ్యర్థులు, వారి కుటుంబీకులపై వైసీపీ వారు దాడులు చేస్తున్నారని, బెదిరిస్తున్నారని.. వైసీపీ కవ్వింపు చర్యలపై ఎన్నికల కమిషన్ నిఘా పెట్టి సంబంధీకులపై చర్యలు తీసుకోవాలన్నారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



ఏఎన్‌యూలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ, ఆర్వో రాజకుమారి

మంగళగిరి, మే 8: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం గుంటూరు పార్లమెంటుతోపాటు ఏడు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా అధికారులు పరిశీలించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ ఏర్పాట్లు, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టరు, ఎన్నికల అధికారి ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బందోబస్తు, బారికేడింగ్, ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

నల్లమేకలవారిపాలెంలో బ్రాహ్మణి పూజలు



నల్లమేకలవారిపాలెంలో నారా బ్రాహ్మణికి హారతి ఇస్తున్న మహిళలు

దుగ్గిరాల, మే 8: నల్లమేకలవారిపాలెంలోని లక్ష్మీ తిరుపతమ్మతల్లి, గోపయ్యస్వామివారి ఆలయంలో నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి పూజలు నిర్వహించారు. లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ తిరుపతమ్మతల్లి ఆలయం, శ్రీకృష్ణమందిరం, శ్రీసీతారాములవారి ఆలయంలో పూజలు, చర్చిలో ప్రార్థనలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు బ్రాహ్మణికి హారతిచ్చి స్వాగతం పలికారు. ఆమె తిరుపతమ్మవారికి కుంకుమబొట్టుపెట్టి, పూలదండలు వేసి పూజలు జరిపించారు. అనంతరం బ్రాహ్మణి మాట్లాడుతూ లోకేశ్‌పై గ్రామస్తులు చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, వేణు, మహిళలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌రెడ్డికి సగర కులం ఉందనేది తెలియదట

● ఆయన ఎలా సీఎం అయ్యారో తెలియటం లేదు: తాడిశెట్టి మురళి

తాడికొండ మే 8: ప్రజాసేవ చేయటానికి రాజీకీయాల్లోకి వచ్చే ప్రతి వ్యక్తికి రాష్ట్ర, దేశ భౌగోళిక పరిస్థితులు, కులాలు, మతాలు సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు అన్నీ సమగ్రంగా తెలిసి ఉండాలి కానీ సీఎం జగన్‌రెడ్డికి సగర కులం అనేది ఉందని తెలియదన్నాడని టీడీపీ నాయకులు తాడిశెట్టి మురళి ఎద్దేవా చేశారు. బుధవారం తాడికొండ బీసీకాలనీలో సగరుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీ కులం ఏమిటి? అసలు మీరేం చేస్తుంటారని స్వయంగా నన్ను సీఎం జగన్‌రెడ్డి అడగటంతో వైసీపీలో ఇమడలేక టీడీపీలోకి చేరానని తెలిపారు. రాజధాని అమరావతి విషయంలో తప్పు చేయటమే కాకుండా, కులాలుగా విడగొట్టి రెచ్చగొడుతున్న సీఎం జగన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో అపజయం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీలాల కృష్ణారావు, తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు సభ్యులు చిమట పూర్ణచందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రస న్నకుమార్, సీనియర్ నాయకులు ఎద్దూరి హనుమంతురావు, మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్‌కుమార్, లాయర్ సుధారాణి, మక్కెర శ్రీను, గండికోట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



బండారుపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

తాడికొండ, మే 8: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మానుకొండ శివరామకృష్ణ తెలిపారు. బుధవారం తాడికొండ మండలం బండారుపల్లిలో టీడీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు, ఎన్నికల బ్యాలెట్ నమూనాలను పంపిణీ చేశారు. తీన్మార్ డప్పులు డీజేలతో భారీ జనసందోహంతో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ రాష్ట్రంలో గల్లంతవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి లేదని సంక్షేమం కూడా అప్పులు చేసి, ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి అమలు చేసిందన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి జాబ్ క్యాలెండర్ లేకుండా చేశారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలను జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు అన్నివర్గాల ప్రజలకు లబ్ధిచేకూరుతాయన్నారు. బీసీలకు అండగా టీడీపీ ప్రభుత్వమే ఉన్నదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దండమూడి సాంబశివరావు, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెనుమాకలో ఎన్డీఏ కూటమి శ్రేణుల ప్రచారం



పెనుమాకలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి, మే 8: తాడేపల్లి మండలం పెనుమాకలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు టీడీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ గ్రామంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. అమరావతి రాజధానిగా నిలబడాలన్నా, ఆరు కోట్ల ఆంధ్రుల ఆత్మ గౌరవం తొణికిసలాడాలన్నా యువత ఉద్యోగాలతో సంతోషంగా ఉండాలన్నా అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబును రాష్ట్రానికి సీఎంను చేయాల్సిన ఆవశ్యకత ఉందని నేతలు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్ (బాబి), పఠాన్ జానీఖాన్, జనసేన, బీజేపీ, టీడీపీ నేతలు విస్తృతంగా పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో టీడీపీ నేతల ప్రచారం

తాడేపల్లి, మే 8: మండలంలోని వడ్డేశ్వరం రాధారంగానగర్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు మంగళవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈవీఎంల ద్వారా ఓటు వేసే తీరుపై అవగాహన కల్పించారు. సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదనరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నారా లోకేశ్, ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు ఈపూరి కోటయ్య, కాట్రగడ్డ మధుసూదనరావు, మద్దినేని సుబ్రహ్మణ్యం, కొడవటి వాణి, అబ్రహాం, సురేష్, కామినేని మౌనిక, కాట్రగడ్డ గోపాలకృష్ణయ్య, కాట్రగడ్డ లక్ష్మణరావు, కత్తిక శ్రీరాములు, జనసేన నేత అధికారి రాజేష్, టీఎన్‌టీయూసీ, తెలుగుయువత నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యానాదుల సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రకుమార్

యానాదుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మే 8: యానాదుల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని చింతలపూడిలో డీవీసీ కళ్యాణ మండపంలో బుధవారం యానాదుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నరేంద్ర కుమార్‌కు నియోజకవర్గంలో యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజెప్పారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ తన తండ్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి హయాం నుంచి తమ కుటుంబానికి యానాది సామాజికవర్గం అండగా ఉందని గుర్తు చేసుకున్నారు. రక్షణ కవచంలా తమను కాపాడి వెన్నంటి నిలబడిన యానాదులకు ధన్యావాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యానాది కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. యానాదులు కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరువీధుల శంకర్ ప్రసాద్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు కల్లూరు చిన్నపెంచలయ్య కుమరగిరి చెంచయ్య, పొన్నూరు అంకమ్మ రావు, తట్టా బులయ్య, తలపల లవయ్య, బాలకృష్ణ, రమేష్, ఉష, పూర్ణ, బ్రహ్మయ్య పాముల బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయనున్నట్లు తెలిపారు. పొన్నూరు సమస్యలు అసెంబ్లీలో వినిపించి పరిష్కరించుకోవాలంటే నరేంద్రకుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. అలాగే పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలలో హాజరైయ్యారు.

మామిళ్లపల్లిలో నాగశాయి వైదీప్తి ప్రచారం

పొన్నూరు టౌన్, మే 8: ప్రజా సమస్యలను పరిష్కరించే విషయంలో ధూళిపాళ్ళ ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి అన్నారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో బుధవారం వైదీప్తి కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంచిపెట్టి సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైదీప్తి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు మౌలిక వసతుల లేమితో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆరోపించారు. గతంలో పొన్నూరులో జరిగిన అభివృద్ధి ఏదైనా ఉందంటే అది నరేంద్రకుమార్ మాత్రమే చేశారన్నారు. తాము ఎప్పటికీ ప్రజలకు అందుబాటులోనే ఉంటామని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా



మామిళ్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైదీప్తి తదితరులు

పెదకాకాని మండలంలో నరేంద్ర ప్రచారం

పెదకాకాని, మే 8: మండలంలోని పలు గ్రామాల్లో కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు గ్రామాల్లోని సమస్యలను నరేంద్రకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ వైసీపీ నాయకులు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొన్నాక చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. రాష్ట్రాభివృద్ధి, గ్రామాల అభివృద్ధికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి నన్ను, పెమ్మసాని చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. కొప్పారావూరు, ఆగతావరప్పాడు, కొప్పారావూరు రామచంద్రపాలెం, ఆగతవరప్పాడు గ్రామల్లోని సమస్యలను నరేంద్రకుమార్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామచంద్రపాలెం మాజీ సర్పంచ్ గోగినేని అమరేంద్ర, కొప్పురావూరు ఉప సర్పంచ్ విన్నకోట పూర్ణ శంకర్రావు, మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, జనసేన మండలం పార్టీ అధ్యక్షుడు వీరెళ్ళ వెంకటేశ్వరరావు, తెలుగుదేశం, జనసేన బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నరేంద్ర సమక్షం టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పలువురు టీడీపీలో చేరిక

పెదకాకాని, మే 8: పెదకాకాని మండలం పెదకాకాని, తక్కెళ్ళపాడు, వెంకటకృష్ణాపురం, నంబూరు గ్రామాలకు చెందిన అనేకమంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఈ మేరకు బుధవారం పొన్నూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ టీడీపీ కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు. పెదకాకాని 46వ బూత్ వైస్సార్సీపీ పార్టీ కన్వీనర్ పమిడిమళ్ళ అనిల్ కుమార్, తోరటి శివయ్య కానుగంటి శ్రీనివాసరావు, నీలం శ్రీనివాసరావు, ముగతవరపు ప్రసాదు తదితరులు, నంబూరు అంబేద్కర్ నగర్ చెందిన వైసీపీ నాయకులు బత్తుల లక్ష్మయ్య (డానియేలు) తురక సుదర్శన్, కంచర్ల అబ్రహం, ఆసిలేటి దానియేలు, తక్కెళ్ళపాడుకు చెందిన శ్యామెల్, పవన్, బుల్లి, రాహుల్, వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ తోటకూర సోమయ్య, తోటకూర పున్నారావు, బండి సురేష్ తదితరులు టీడీపీలో చేరారు.



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న టీడీపీ రజక సాధికార డైరెక్టర్ దుర్గాప్రసాద్, శ్రీనివాస్ తదితరులు

కూటమి అభ్యర్థులను గెలిపించండి

● టీడీపీ రజక సాధికార డైరెక్టర్ దుర్గాప్రసాద్

తెనాలి, మారీసుపేట మే 8: రానున్న ఎన్నికలలో బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేసే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ రజక సాధికార డైరెక్టర్ మునిపల్లి దుర్గాప్రసాద్ కోరారు. పట్టణంలోని 3వ వార్డులో బుధవారం టీడీపీ రజక సాధికార డైరెక్టర్ మునిపల్లి దుర్గాప్రసాద్ అధ్వర్యంలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికి తిరుగుతూ బ్యాలెట్ నమూనాను చూపుతూ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్, యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పన ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మే 13న జరిగే ఎన్నికలలో తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు గాజు గ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపైన ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మంచాల శ్రీనివాస్, కొల్లూరు చంద్ర, కె వెంకట్రావు, షేక్ ఆదామ్ షఫి, కె.సుబ్రహ్మణ్యం, ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట మే 8: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. బుధవారం అన్నదాత సుఖీభవ సభ్యులు మోదుగ రమాదేవి పుట్టినరోజు సందర్భంగా భర్త చలపతిరావు, కుమార్తెలు ప్రశాంతి, మంగళ కుటుంబ సభ్యుల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, బాలునాయక్, అబ్దుల్ రజాక్, పోతరాజు, శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

కొల్లిపర, మే 8: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడటంతో పోలీసులు మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు తదితర గ్రామాల్లో బుధవారం వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనదారులు తమ వెంట నగదు తీసుకెళ్ళేటప్పుడు నగదుకు సంబంధించిన వివరాలను, ఆధారాలను పోలీసులకు చూపాల్సి ఉంటుందన్నారు. వాహనదారులు కూడా తనిఖీకి సహకరించాలన్నారు. ధనం, మద్యం ఆశ చూపి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీ సమయంలో ఆధారాలు చూపకపోతే సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి నగదును, వాహనాన్ని సీజ్ చేయనున్నట్లు తెలిపారు.



బ్యాలెట్ నమూనాపై అవగాహన కల్పిస్తున్న వీరవల్లి మురళి, పార్టీ నాయకులు తదితరులు

పేదవాడి పొట్టకొట్టిన జగన్

● ఎన్నికల ప్రచారంలో వీరవల్లి మురళి

తెనాలి రూరల్, మే 8: పేదవాడి ఆకలి తీర్చాలన్న గొప్ప ఆశయంతో తెలుగుదేశం హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను అధికారం చేపట్టిన వెంటనే వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని మూయించి పేదవాడి పొట్టకొట్టాడని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఉమ్మడి పార్టీ నాయకులతో కలిసి వీరవల్లి మురళి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పట్టణంలోని 29వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజు గ్లాసుగుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ బ్యాలెట్ నమూనాపై ఓటువేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరవల్లి మురళి మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ అరాచకపాలనకు అంతరం పలికే రోజులు దగ్గరలోకి వచ్చాయన్నారు. కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న మనోహర్‌ను గాజుగ్లాసుగుర్తుపై, ఎంపీ అభ్యర్థి పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని మురళి పిలుపునిచ్చారు. రావి చిన్ని, బిట్రయుగంధర్, సిద్దాంతి శ్రీనివాసరరావు, పి.భాస్కరరావు, మహేష్ నాయక్, శంకర్ నాయక్, డి.సత్యనారాయణ, అంకారావు, మలేష, కె.నారాయణ, ఎం.వెంకట్రావు, కె.హనుమంతరరావు, టి.కనకరాజు, కె.వెంకటేష్, తమ్మారెడ్డి చిన్న దుర్గారావు, పలువురు ఉమ్మడి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

తెనాలి, మారీసుపేట మే 8: పట్టణ పరిధిని వార్డులలో పనిచేసే వలంటీర్ల రాజనామాల పరంపర కొనసాగుతుంది. ఈ వారంలో 66మంది రాజీనామాలు చేయగా బుధవారం మరో ఆరుగురు రాజనామా చేశారని మున్సిపల్ కమీషనర్ బి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. అధికారపార్టీ నియోజకవర్గ ముఖ్య నేత ఆదేనుసారం వైసీపీ కౌన్సిలర్లు వార్డు వలంటీర్లతో రాజీనామా చేయించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని ఆదేశిస్తున్నారని కొందరు వలంటీర్లు వాపోతున్నారు.

అభివృద్ధిచేసుకుందాం.. ఆశీర్వదించండి

● ఎన్నికల ప్రచారంలో నాదెండ్ల మనోహర్



వ్యాపారులను ఓటు అభ్యర్థిస్తున్న మనోహర్, ఆలయంలో పూజల్లో పాల్గొన్న మనోహర్

తెనాలి రూరల్, మే 8: ఐదేళ్ల వైసీపీ పాలనలో వెనకబడ్డ తెనాలిని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించుకుందామని అందుకు ప్రజలందరూ కూటమి అభ్యర్థులకు రానున్న ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని జనసేన పీఏసీ చైర్మన్, కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగుజనచైతన్య పాదయాత్రలో భాగంగా మనోహర్ బుధవారం పట్టణంలోని 35,36వ వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వ్యాపారులతో, పట్టణ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాను గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రజలకు చేసే మంచిని వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గతంలో తెనాలి ప్రాంతంలో జరిగిన అభివృద్ధి ఐదేళ్ల వైసీపీ పాలనలో తుడుచుకొట్టుకుపోయిందని విమర్శించారు. ఐదేళ్లు ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు మంచి చేస్తారని ఇక్కడ ఎమ్మెల్యేగా శివకుమార్‌ను గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న నాలుగు వరుసల రోడ్డును కూడా పూర్తి చేయించలేకపోయారని ఆరోపించారు.

ప్రత్యేక పూజల్లో మనోహర్

తెనాలి రూరల్, మే 8: రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాలని ఆ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఉమ్మడి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పట్టణంలోని ఐతానగర్ శివాలయంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా విజయం సాధించాలని కాంక్షిస్తూ పరమశివునికి వివిధ పూజాద్రవ్యాలతో అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, మహా చండీయాగం వంటి హోమాది పూజలు జరిపి స్వామివార్లను వేడుకున్నారు. ఈ ప్రత్యేకపూజా కార్యక్రమాల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్లమనోహర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్, నాయకులు కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, ఈదర శ్రీనివాస్, బాబు, అన్నాబత్తుని శ్రీనివాస్, శ్రీహర్ష, ఈదర బుచ్చయ్య, పాటిబండ్ల రామకృష్ణ,అన్నాబత్తుని దిలీప్, వేమూరిగౌతం, పాలడుగు అంజయ్య, గొంది కృష్ణ, గోగినేని మాధవి, ఆయినంపూడి అనురాధ, ఈదర లీలాపద్మ, అంచా రజిని, జయశ్రీ, ఈదర నాగలక్ష్మిలు పూజా కార్యక్రమాల అనంతరం నాదెండ్లమనోహర్‌ను దుశాలువాలతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్చాలు అందించారు. పలువురు ఉమ్మడి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



కంచర్లపాలెంలో బ్యాలెట్ నమూనాతో టీడీపీ నాయకుల ప్రచారం

కంచర్లపాలెంలో ఇంటింటి ప్రచారం

తెనాలి రూరల్, మే 8: మండలంలోని కంచర్లపాలెంలో ఉమ్మడి పార్టీ నాయకులు కార్యకర్తలు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్లమనోహర్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులను కలుసుకుని వైసీపీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రంలో, గ్రామంలో జరగని అభివృద్ధిపనులపై వివరించి రానున్న ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌కు గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని బ్యాలెట్ నమూనాను చూపుతూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో చుక్కపల్లి బాను, గాలి సాంబశివరావు, చుక్కపల్లి భరత్, రాళ్ళపల్లి శ్రీనివాస్, గుర్రం హరికృష్ణ, కె. జయశేఖర్, రాళ్ళపల్లి అనిత, కోపల్లె శ్రీను, కోటేశ్వరరావు, అజయ్‌బాబు, రామూర్తి, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం అవస్థలు షరా మామూలే

● ఓటు కోసం కాకినాడ వెళ్లివచ్చినా ఫలితం లేదు

● ఉద్యోగులకు తప్పని తిప్పలు

తెనాలి అర్బన్, మే 8: ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్‌కు అనుసరించిన విధానం ఉద్యోగులు, ఉపాధ్యాయులను అవస్థల పాలు చేసింది. ఈ అవస్థలు గమనించిన ఎన్నికల సంఘం ఓటు ఉన్న నియోజకవర్గంలో ఫారం-12 ఇచ్చి 7, 8 తేదీల్లో ఓటు వేసుకోవచ్చని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఉద్యోగులు అవస్థలు పడ్డారు. వివిధ నియోజకవర్గాలు, వివిధ జిల్లాలలో ఓటు ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు తెనాలి నియోజకవర్గంలో పని చేస్తుంటే ఇక్కడ దరఖాస్తు ఇచ్చారు. ఆయా ప్రాంతాల నుంచి ఇక్కడకు ఓటు రాలేదని, అక్కడకు వెళ్లాలని చెప్పడంతో మళ్లీ ఇక్కడ నుంచి అక్కడకు వెళ్లి వచ్చారు. మీ ఓట్లు మేము మీరు పనిచేస్తున్న నియోజకవర్గానికి పంపామంటూ మళ్లీ ఇక్కడ ఓటు ఇచ్చే అవకాశం లేదంటూ తిప్పి పంపడంతో కాళ్లు ఈడ్చుకుంటూ మండుటెండలో తెనాలి వచ్చారు. అదే విధంగా తెనాలి నియోజకవర్గంలో ఓటు ఉండి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో, వివిధ జిల్లాల్లో పని చేసేవారు కూడా ఈవే అవస్థలు ఎదుర్కొన్నారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ తెనాలిలో ఉద్యోగం చేస్తూ కాకినాడలో ఓటు ఉంది. ఆయన తెనాలి నియోజకవర్గంలో ఓటు కోసం దరఖాస్తు చేశారు. కాకినాడ నుంచి ఇక్కడకు ఓటు రాలేదు అక్కడకు వెళ్లి ఓటు వేయాలంటూ సిబ్బంది సెలవిచ్చారు. ఆయన కాకినాడ వెళ్లినప్పటికీ మీ ఓటు మేము తెనాలి పంపాం అక్కడే వేయాలని ఇక్కడ మరోమారు ఇచ్చే అవకాశం లేదంటూ చెప్పారు. దీంతో ఆయనకు ఏం చేయాలో పాలుపోక ఓటు వదిలి వేసుకున్నారు. మున్సిపల్ స్కూల్‌లో పనిచేస్తున్న స్వామి అనే ఉపాధ్యాయునికి రేపల్లెలో ఓటు ఉంది. తెనాలిలో ఆయన ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండవ శిక్షణలో ప్రత్తిపాడులో ఓటు వేయాలని చెప్పారు. కానీ అక్కడ ఓటు ఇవ్వలేదు. రేపల్లె వెళ్లిన అక్కడ కూడా చుక్కెదురైంది. మూడు చోట్లకు తిరిగి విసిగిపోయిన ఆయన సబ్ కలెక్టర్‌ను సంప్రదించి విచారణ చేయాలని కోరారు. మరో ఉపాధ్యాయుడు కేఎస్ఎస్ ప్రసాద్ వినుకొండలో పనిచేస్తూ తెనాలిలో ఉన్న ఓటు కోసం దరఖాస్తు చేశాడు. ఆయన రెండు పట్టణాల మధ్య తిరిగిన ఫలితం కానరాలేదు. ఎన్నికల కమిషన్ స్విప్ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసి ఓటు వేయాలనే ప్రతి ఒక్కరికి చెప్పిన దానికి విలువ ఏముందంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో పనిచేస్తున్న వారికి కూడా ఇలాంటి సమస్యే ఎదురైంది. మరో మహిళ వేరే నియోజకవర్గంలో ఉన్న ఓటు తెనాలికి వచ్చిందని నాలుగు గంటల పాటు క్యూ లైన్లలో నిలబడి తీరా పోలింగ్ బూత్‌లోకి వెళితే ఓటు రాలేదని చెప్పడంతో హతాశురాలైంది. వీరంతా పోస్టల్ ఓటింగ్ బూత్‌ల పర్యవేక్షణకు వచ్చిన సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రఖర్‌జైన్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు పర్యవేక్షిస్తున్న కొల్లిపర తహసీల్దార్ శ్రీనివాసులుతో మాట్లాడి ఆర్టీసీ డ్రైవర్ల నుంచి డిక్లరేషన్ తీసుకుని ఓటు వేయించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బ్యాలెట్లను విచారించాలని వారి చేత ఓటు వేయించాలని ఆదేశించారు.



సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు మొరపెట్టుకుంటున్న ఉద్యోగులు

తెనాలిలో 2360 పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

తెనాలి అర్బన్, మే 8: తెనాలి మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో 2360 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెనాలి నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఇక్కడ పని చేస్తున్న వారితో పాటు వివిధ నియోజకవర్గాల్లో ఓటు ఉన్న వారంతా ఇక్కడ ఏర్పాటు చేసిన 14 కేంద్రాల్లో ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగిన మూడు రోజుల్లో ఓటు కలిగిన ఉద్యోగులు, పోలీసులు, ఉపాధ్యాయులు, డ్రైవర్లు, అత్యవసర సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కమిషన్ గడువు ఇచ్చిన రెండు రోజుల్లో కూడా ఇంకా కొంత మంది మిగిలిపోయారు. వీరికి ప్రత్యేక ఆదేశాలు ఇచ్చి రెండోసారి ఫారం-12 తప్పనిసరిగా ఓటున్న నియోజకవర్గంలో తీసుకుని పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని కోరుతున్నారు.

అమరావతి కాలనీ అభివృద్ధి చేసే వారికే ఓటు

● కాలనీ సంఘం తీర్మానం

తెనాలి అర్బన్, మే 8: తెనాలి పట్టణంలోని చెంచుపేట అమరావతి కాలనీని అభివృద్ధి చేసే వారికే మద్దుతు ఇస్తామని కాలనీ సంక్షేమ సంఘం తీర్మానించింది. బుధవారం సమావేశమైన సంఘం రహదారులు, డ్రైనేజీ కాల్వలు, కల్వర్టు ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, లైబ్రరీ నిర్మాణం, పాఠశాలల ఏర్పాటు, కన్వెన్షన్ సెంటర్, వృద్ధులకు డేకేర్ సెంటర్ వంటి పలు వసతులను కల్పించాలని తీర్మానించారు. పరిపాలన రాజధాని విశాఖపట్నం తరలించకుండా ఏకైక రాజధాని అమరావతిని ఉంచాలని, ఇంటి పన్ను, ఆస్తి పన్ను పెంపు రద్దుచేయాలని, చెత్తపన్ను తొలగించాలని, ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేయాలని పేర్కొన్నారు. సంఘ అధ్యక్షుడు జి.నారాయణరావు, కార్యదర్శి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు తొమ్మిదిమంది ట్రైనీ ఎస్పీలు

● నిబంధనలు వివరించిన ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, మే 8: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ వివిధ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది మంది ట్రైనీ ఐపీఎస్‌లను నియమించింది. ఈ మేరకు ఆయా అధికారులతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఎన్నికలకు సంబంధించి పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఇతర డ్యూటీల విషయంలో పాటించవలసిన ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ గురించి ట్రైనీ ఐపీఎస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో క్రిటికల్ పోలింగ్‌స్టేషన్ గురించి తెలుసుకోని, ఎలక్షన్ కమిషన్ నియమావళి, ఎలక్షన్ కమిషన్ వారి ఎలక్షన్ గైడెన్స్ ప్రకారం నడుచుకోనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు కార్యాలయంలో వున్న కాన్ఫరెన్స్ హాలులో విధివిధానాలు వివరించారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో అదనపు బందోబస్తుకు వినతి

పొన్నూరు టౌన్, మే 8: పొన్నూరు నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో అదనపు బందోబస్తును ఏర్పాటు చేయాలని కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. పొన్నూరు నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు ఉండగా 87 పోలింగ్ స్టేషన్లలో సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలలో అదనపు బలగాలను ఏర్పాటుచేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించాలని రాష్ట్ర ఎన్నికల అధికారిని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైపర్ ఆది

మనోహర్‌ను గెలిపించుకుందాం

● జనసేన క్యాంపెనర్ హైపర్ ఆది

తెనాలి రూరల్, మే 8: తెనాలిలో ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుని జనసేన జెండాను రెపరెపలాడిద్దామని జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది అన్నారు. బుధవారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేసిన హైపర్ ఆది నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన సభలో ఆది మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం పూర్తిగా దివాళాతీసిందని అభివృద్ధి సంక్షేమం కాస్త అతివృష్టి అనావృష్టిగా మారిందని ఆరోపించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి జరగకపోగా కులాల మధ్య చిచ్చుపెట్టడం, ప్రజల్లో విద్వేషాలు పెంచడం, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులు, ఎదిరిస్తే కేసులు, అడ్డుకుంటే దాడులతో రాష్ట్రం అట్టుడికిందని ఆక్షేపించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేత ముద్రగడ చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమన్నారు. ప్రజల కోసం పనిచేసే పవన్‌కు రాష్ట్రం ఏమైపోతే నాకేంటి అధికారమే కావాలంటూ తాపత్రయపడే ముద్రగడ పద్మనాభానికి ఉన్నతేడా ప్రజలే గమనిస్తున్నారన్నారు. తనను కమెడియన్ అంటూ మాట్లాడుతున్న వైసీపీ నాయకులు రాష్ట్రంలో జరగని అభివృద్ధిని జరిగినట్లు ప్రజల్లో ప్రచారం చేస్తూ వారే తమనుమించిన కమెడియన్లుగా ప్రజల్లో పేరుపొందారన్నారు. తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గతంలో ఈ ప్రాంతంలో అభివృద్ధిపనులు చేపట్టి ప్రజలకు సౌకర్యాలు కల్పించిన ఘనత మనోహర్‌దేనన్నారు. జనసేన అధికారంలోకి రాకపోయినా పవన్ కల్యాణ్‌కు, పార్టీకి అండగా నిలిచిన వ్యక్తి మనోహర్ అన్నారు. ప్రజల కోసం, ప్రాంతం కోసం పాటుబడే మంచి మనసున్న మనోహర్‌ను రానున్న ఎన్నికల్లో గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి వైసీపీ రాక్షస పాలనను తరిమి కొట్టాలని ఆది పిలుపునిచ్చారు. తొలుత తెనాలి విచ్చేసిన ఆదిని పలువురు ఉమ్మడి పార్టీశ్రేణులు, ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించారు. పెద్దసంఖ్యలో అభిమానులు ఆదితో కలిసి ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. పెద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మనోహర్ సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి షబ్బీర్‌బాష తదితరులు

వైసీపీ పాలనలో అసంతృప్తి.. కూటమితో అభివృద్ధి

తెనాలి రూరల్, మే 8: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి జరగకపోగా సంక్షేమం పేరుతో అన్నింటా ధరలు పెంచారని ప్రజల్లో, ఆ పార్టీ నాయకుల్లో అసంతృప్తి ఉందని కూటమితోనే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి, ప్రజలకు సంక్షేమం లభించనున్నదని జనసేన పీఏసీ ఛైర్మన్, కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో వైసీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షబ్బీర్ బాష, మాజీ కౌన్సిలర్ మునిపల్లి ప్రసాద్ వారి మిత్రబృందంతో ఆ పార్టీకి రాజీనామా చేసి నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారిని మనోహర్ పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోహర్ వారిని అభినందించి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించి ప్రజలకు మంచి చేస్తారని నమ్మి వైసీపీ గెలుపునకు షబ్బీర్ బాషా, మునిపల్లి ప్రసాద్ వంటి నాయకులు ఎంతో శ్రమించారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత జగన్ రాష్ట్రానికి, ప్రజలకు మంచి చేయకపోగా రాజధాని తరలింపు అంటూ ప్రజల్లో ప్రాంతాల మధ్య విబేదాలు తెచ్చేలా చేశాడని ఆరోపించారు. ప్రజలందరికీ మంచి చేస్తానన్న జగన్ అన్నింటా ధరలు పెంచి, ఇసుక నుంచి మట్టి, పేదల నివేశన స్థలాల పేరుతో దోపిడీకి తెరలేపారని ఆక్షేపించారు. ఆ పార్టీలో ప్రజలకు మంచి జరగదని గ్రహించిన నాయకులు రాష్ట్రాన్ని తీర్చిదిద్దగలిగే కూటమివైపు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించిందేందుకు కృషి చేయాలని మనోహర్ పిలుపునిచ్చారు.